

అందరి సహకారంతో జిల్లా అభివృద్ధికి కృషి

నూతన కలెక్టర్ విజయకృష్ణన్ ›› కలెక్టర్‌గా బాధ్యతల స్వీకారం

అనకాపల్లి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): అందరి సహకారంతో జిల్లాను ప్రగతి పథంలో నడిపించేందుకు కృషిచేస్తానని జిల్లా కలెక్టర్ కె.విజయకృష్ణన్ అన్నారు. నూతన కలెక్టర్‌గా ఆమె శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. శంకరంలో కలెక్టరేట్ భవనానికి చేరుకున్న ఆమెను జాయింట్ కలెక్టర్ జాహ్నవి, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, కలెక్టరేట్ వివిధ విభాగాల ఉద్యోగులు స్వాగతం పలికారు. ఉదయం 10 గంటలకు కలెక్టర్ సంతకం చేసి బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఎస్పీ మురళీకృష్ణ, ఏఎస్పీ విజయభాస్కర్, పలు శాఖల అధికారులు కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా రెవెన్యూ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు రత్నం, వీఆర్‌ఓల సంఘ గౌరవాధ్యక్షుడు ఈర్లె శ్రీరామ్మూర్తి తదితరులు కలెక్టర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బదిలీపై వెళుతున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి వీడ్కోలు సభకు ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో వివిధ విభాగాలకు చెందిన ఉద్యోగులతో పరిచయం చేసుకున్నారు. అనంతరం కలెక్టర్ విజయకృష్ణన్ మాట్లాడుతూ అందరికీ అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రయత్నిస్తానన్నారు. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలు, పథకాలను తూచ తప్పకుండా పాటించి ప్రజలకు మేలు చేయడమే లక్ష్యంగా పనిచేస్తానన్నారు.



కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న కె.విజయకృష్ణన్

నూకాంబికను దర్శించుకున్న నూతన కలెక్టర్

అనకాపల్లి టౌన్: స్థానిక నూకాంబిక అమ్మవారిని బాలాలయంలో శుక్రవారం నూతన జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన ఆమెకు ఆలయ ఈవో బండారు ప్రసాద్, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మండపంలో అర్చకులు ఆశీర్వచనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌కు ఈవో ప్రసాద్ సత్కరించి, అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని అందజేశారు. అలాగే టీడీపీ, జనసేన నాయకులు బీఎస్ఎంకే జోగినాయుడు, పీలా నాగశ్రీను, తాడి రామకృష్ణ, ఆళ్ల రామచంద్రరావులు కలెక్టర్‌ను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో చిన్నికృష్ణ, అనకాపల్లి ఇన్‌చార్జి తహసీల్దార్ మధుసూదనరావు పాల్గొన్నారు.



అమ్మవారిని దర్శించుకున్న కలెక్టర్ విజయకృష్ణన్

రూఫ్‌టాప్ సోలార్‌పై ప్రత్యేక దృష్టి

ప్రతి వినియోగదారుడూ తీసుకోవచ్చు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- గ్రామాలకూ త్రీఫేజ్ విద్యుత్ సరఫరా
- రూ.1,600 కోట్లతో ఫీడర్ల ఏర్పాటు
- గత ఏడాదిలో 13 వేల వ్యవసాయ కనెక్షన్లు ఇచ్చాం
- గిరిజన గ్రామాల్లో 35 వేల ఇళ్లకు విద్యుత్ సరఫరాకు రూ.150 కోట్ల వ్యయం
- 8 లక్షల స్మార్ట్ మీటర్ల బిగింపునకు చర్యలు



'ఆంధ్రజ్యోతి'తో ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్) పరిధిలో ప్రతి గ్రామానికి 24/7 విద్యుత్ సరఫరా ఇచ్చేందుకు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నామని సీఎండీ పృథ్వీతేజ్ తెలిపారు. ఆయన శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో ప్రత్యేకంగా మాట్లాడారు. గత ఏడాది కాలంలో డిస్కమ్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులు వివరించారు. 'ప్రధానమంత్రి సూర్య ఘర్' పథకానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని, దీనిని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. గతంలో రూఫ్‌టాప్ సోలార్ పథకం కింద కిలోవాట్‌కు రూ.16 వేలు రాయితీ ఇచ్చేవారని, ఇప్పుడు దానిని మొదటి మూడు కిలోవాట్లకు రూ.78 వేలకు పెంచారన్నారు. దీనిని ప్రతి విద్యుత్ వినియోగదారుడు తీసుకోవచ్చునని, సంబంధించిన యాప్‌లో సర్వీసు నంబరుతో రిజిస్టర్ కావలసి ఉంటుందన్నారు. ఇప్పుడు పది కిలోవాట్ల వరకు ఎటువంటి ఫీజుబులిటీ రిపోర్ట్ అవసరం లేకుండానే పథకం వర్తింపజేస్తారని, బ్యాంకులు కూడా రుణాలు ఇస్తాయని, డౌన్ పేమెంట్ కింద కేవలం రూ.10 వేలు భరించగలిగితే రూఫ్‌టాప్ సోలార్ పొందవచ్చునన్నారు. విశాఖపట్నం నగరంలో మిగిలిన ప్రాంతాల్లోను అండర్ గ్రౌండ్ కేబుల్ పనులు త్వరలో ప్రారంభిస్తామని చెప్పారు.

13 వేల వ్యవసాయ కనెక్షన్లు

గత ఏడాది కాలంలో డిస్కమ్ పరిధిలో 13 వేల మంది రైతులకు ఉచిత విద్యుత్ వ్యవసాయ కనెక్షన్లు ఇచ్చామన్నారు. ఎన్నికల సమయంలో కోడ్ అమలులో ఉండడం వల్ల 2,400 పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని కూడా మంజూరుచేస్తామని చెప్పారు. వ్యవసాయానికి 9 గంటలు ... మిగతా 8వ పేజీలో

సాగు జాగే..?

అరకొరగానే వర్షాలు

- వేసవిని తలపిస్తున్న ఎండలు
- గత ఏడాది పరిస్థితులే పునరావృతం
- ఆకు పోతలపై డైలమాలో అన్నదాతలు
- మరింత ఆలస్యంగా ఖరీఫ్ సీజన్



గౌరీపట్నంలో ఇంకా విత్తనాలు చల్లక ఖాళీగా ఉన్న పొలాలు

చోడవరం, జూలై 5: గత ఏడాది ఖరీఫ్‌లో నెలకొన్న పరిస్థితులే ఈ ఏడాది కూడా పునరావృతమవుతున్నాయి. ఫలితంగా ఖరీఫ్ సీజన్ మరింత ఆలస్యమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. జూన్ నెలలో సాధారణ వర్షపాతం కంటే తక్కువగా వర్షాలు కురవడంతోపాటు జూలై నెల మొదటి వారం ప్రారంభమైనా పెద్దగా వర్షాల జాడ లేకపోవడంతో అన్నదాతలు వేచి చూసే ధోరణిలో ఉన్నారు. ఇదే సమయంలో ఎండాకాలాన్ని తలపించేలా ఎండతో పాటు, వాతావరణంలో ఉక్కపోత కూడా ఎక్కువగా ఉండడంతో రైతులు ఆకుపోతలు పోసే విషయంలో ఆచీతూచి అడుగులు వేస్తున్నారు. రిజర్వాయర్ల పరిధిలోనూ, అక్కడక్కడా చెరువుల కింద సాగయ్యే భూముల పరిధిలో విత్తనాలు చల్లినా, మిగిలిన ప్రాంతాల్లో ఇంకా ఆకుపోతలు ప్రారంభం కాలేదు. గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లో జూన్, జూలై నెలల్లో సాధారణ వర్షపాతం కంటే తక్కువగా వర్షాలు కురవగా, ఆగస్టు నెల రెండవ వారం వరకూ వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో గత ఖరీఫ్‌లో వరి సాగు మందకొడిగానే సాగింది. ఏటా జూలై నెల రెండో వారానికే చాలాచోట్ల వరినాట్లు ప్రారంభమై ఆగస్టు నెలాఖరు నాటికి 80శాతం పైగా వరి నాట్లు పూర్తికావలసి ఉండగా, గత ఏడాది ఆగస్టు నెల రెండోవారం నాటికి కూడా చోడవరం సబ్‌డివిజన్ పరిధిలోని మండలాల్లో 12,972 హెక్టార్లకు కేవలం 5,232 హెక్టార్లలోనే వరి నాట్లు అంటే 40 శాతం మేర మాత్రమే పడ్డాయి. సీజన్ పూర్తయ్యేసరికి సాధారణ వరి విస్తీర్ణం కంటే తక్కువగానే వరినాట్లు పడ్డాయి.

> **వర్షాలు పడితే సీజన్ మొదలైపోతుంది**
>
> సీజన్‌లో వర్షాలు కాస్త తక్కువగానే కురిశాయి. ప్రస్తుతం వర్షాలు కురవాల్సి ఉంది. వర్షాలు పడితే వ్యవసాయం సీజన్ ఊపందుకుంటుంది.
>
> **- రవీంద్రనాథ్,** ఏడీఏ, చోడవరం సబ్ డివిజన్

ఈ ఏడాది అదే పరిస్థితి?

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సైతం గత ఏడాది పరిస్థితులు కనిపిస్తున్నాయని అన్నదాతలు అంటున్నారు. వాస్తవానికి జూన్ నెలాఖరు నుంచే చాలాచోట్ల ఆకుమడులు తయారు చేసి విత్తనాలు చల్లే ప్రక్రియ ప్రారంభమవుతుంది. చెరువులు పరిధిలోనూ, జలాశయాల పరిధిలోనూ మరికొంత ముందుగానే విత్తనాలు చల్లుతారు. కానీ ఈ ఏడాది జూన్‌లో వర్షాల జాడ లేకపోగా, ఎండలు తీవ్రంగా ఉండడంతో విత్తనాలు చల్లే పనితోపాటు, చెరకు దవ్వ ఉడుపులు ఇంకా చాలాచోట్ల ప్రారంభం కాలేదు. గ్రామీణ ప్రాంతంలో ఇటీవల అక్కడక్కడా వర్షాలు పడినా, అవి సాగు అవసరాలకు సరిపడా స్థాయిలో కురవకపోగా, ఎండలు కూడా తగ్గకపోవడంతో అన్నదాతలు డైలమాలో పడ్డారు. చాలాచోట్ల రైతులు ఇంకా ఆకుమడులు సిద్ధం చేయలేదు. మరికొన్ని గ్రామాల్లో ఆకుమడులు దున్ని సిద్ధం చేసుకున్నా, విత్తనాలు చల్లిన తరువాత వర్షాలు సరిగ్గా కురవకపోతే ఏమిటన్న భయం రైతులను వెంటాడుతున్నది. కాగా, మండలాల్లో వర్షపాతం లోటు వల్ల ఆకుపోతలు తక్కువగానే ఉన్నాయని, వర్షాలు పడితే విత్తనాలు చల్లే ప్రక్రియ జోరందుకుంటుందని వ్యవసాయాధికారులు అంటున్నారు. ఈ నెలలో వర్షాలు గట్టిగా కురిస్తే, ఆగస్టు మొదటి వారంలోనే వరినాట్లు మొదలయ్యే అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నారు.

ఆడపిల్లలు ఆత్మస్థైర్యంతో ఉండాలి

దేనికీ భయపడొద్దు

- ధైర్యంగా సమస్యలు ఎదుర్కోనాలి
- రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత
- 'పేట'లో పాఠశాలలు తనిఖీ

పాయకరావుపేట, జూలై 5: ఏ సమస్య ఎదురైనా విద్యార్థినులు భయపడకుండా ధైర్యంగా ఉండి ఎదుర్కోవాలని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జడ్పీ బాలికోన్నత పాఠశాలలను ఆమె ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినుల సమస్యలను హోం మంత్రి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎటువంటి సమస్య ఎదురైనా విద్యార్థినులు ఆత్మస్థైర్యంతో ఎదుర్కోనాలన్నారు. పాఠశాల, బయట ఎక్కడైనా సరే ఎవరైనా ఎటువంటి ఇబ్బందులకు గురిచేసినా భయపడకుండా సమస్యను ఉపాధ్యాయులు, పోలీసులకు తెలియజేయాలన్నారు. అన్ని విధాలా రక్షణ కల్పించేందుకు తామంతా ఉన్నామన్నారు. విద్యార్థినులు క్రమశిక్షణ, ఏకాగ్రతతో కష్టపడి చదువుకుని అనుకున్న లక్ష్యాలను సాధించాలన్నారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న హోం మంత్రి అనిత



ప్రభుత్వ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం రుచి చూస్తున్న మంత్రి అనిత

అంతకుముందు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసిన హోం మంత్రి వి.అనిత మధ్యాహ్న భోజన పథకం అమలు, డైనింగ్ హాల్‌ను పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులకు కోసం వండిన భోజనాన్ని రుచి చూశారు. విద్యార్థులకు రుచికరమైన భోజనం పెట్టాలని, డైనింగ్ హాల్‌ను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని ఎండీఎం సిబ్బందిని మంత్రి ఆదేశించారు.

ఆడపిల్లలను ఇబ్బంది పెడితే ఉపేక్షించను : అనిత

అనంతరం హోం మంత్రి అనిత విలేకరులతో మాట్లాడుతూ పాయకరావుపేట పాఠశాలల్లో విద్యార్థుల పరిస్థితిని తెలుసుకునేందుకు వచ్చామన్నారు. బాలికోన్నత పాఠశాల ... మిగతా 8వ పేజీలో

ఏపీఐఐసీ భూమి స్వాధీనం

వైసీపీ నేత కబంధ హస్తాల్లో పది ఎకరాలు

- ఐదేళ్లుగా పట్టించుకోని ఏపీఐఐసీ అధికారులు
- ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ఆదేశంతో కదిలిన యంత్రాంగం
- లంకధర్మవరం ఆలయ భూములపైనా ఆరా
- వివరాలివ్వాలని తహసీల్దార్‌కు ఆదేశం
- వైసీపీ నేతలకు సహకరించిన అధికారుల్లో మొదలైన ఆందోళన



స్థలాన్ని ఖాళీ చేయిస్తున్న ఏపీఐఐసీ అధికారులు

అచ్యుతాపురం, జూలై 5:

వైసీపీ నాయకుల అక్రమాలపై ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ కొరడా ఝుళిపిస్తున్నారు. ఏపీఐఐసీ భూముల్లో గత ఐదేళ్లుగా వైసీపీ నాయకుడు ఆక్రమించి, సాగు చేస్తున్న భూమిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే లంక ధర్మవరంలో ఆలయ భూముల వివరాలను ఇవ్వాలని రెవెన్యూ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించడంతో వైసీపీ నేతలు, అధికారులు ఆందోళన చెందుతున్నారు. వివరాల్లోకి వెళ్తే...

అచ్యుతాపురం-రాంబిల్లి మండలాల్లో పది వేల ఎకరాలను ఏపీఐఐసీ రైతుల నుంచి సేకరించింది. ఈ భూములకు పరిహారంతో పాటు పునరావాసం కూడా కల్పించింది. రైతుల నుంచి సేకరించిన భూమిని వివిధ కర్మాగారాలకు ఇవ్వగా, పది ఎకరాలు భూమి ఖాళీగా ఉంది. ఈ భూమిపై దిబ్బపాలెం పంచాయతీకి చెందిన మాజీ ఎమ్మెల్యే అనుంగ శిష్యుడు కన్ను పడింది. ఈ భూమిలో రెండు పెద్ద బావులతోపాటు ఏపుగా పెరిగిన కొబ్బరి తోట మధ్యలో మామిడి చెట్లు కూడా ఉన్నాయి. దీంతో ఆ నాయకుడు కొబ్బరి తోటల మధ్యలో పాకలు వేసి తన కుటుంబ సభ్యులను పెట్టాడు. అంతేకాకుండా 35 వరకు గేదెలను కొని అక్కడే ఉంచాడు. బావుల్లో నీరు ఉండడంతో మునగతోట వేశాడు. ఈ భూమి ఏపీఐఐసీ స్వాధీనం చేసుకోక ముందు రాంబిల్లి మండలం గురజాపాలెం పరిధిలో ఉండేది. అప్పట్లో సాగురైతులకు భూమితోపాటు, బావులు, కొబ్బరి, జీడిమామిడి, మామిడి చెట్లకు కూడా అధికారులు పరిహారం ఇచ్చారు. ప్రస్తుతం వైసీపీ నాయకుడు ఆక్రమణలో ఉన్న కొబ్బరి, మామిడి, జీడిమామిడి చెట్ల ఫలసాయం ఏపీఐఐసీకి చెందాలి. కానీ వైసీపీ అధినాయకుడి ఒత్తిడితో ఏపీఐఐసీ అధికారులు పట్టించుకోలేదు. అంతేకాక ఈ భూమి ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీఎల్) కార్యాలయం వెనుక ఉన్నందున ఎవరూ పట్టించుకోలేదు. ఇక్కడ ఉన్న బావుల్లో నీటిని ట్యాంకర్ల ద్వారా సెజ్‌లో నిర్మిస్తున్న కర్మాగారాలకు విక్రయించేవారు. ఒక ట్యాంకరు నీటిని రూ.వెయ్యికి విక్రయించేవారు. ఈ భూముల ద్వారా వైసీపీ నాయకుడుకు నెలకు భారీ మొత్తంలో ఆదాయం వచ్చేది. దీనిని గత ఏప్రిల్‌లో 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చింది. అయినా ఏపీఐఐసీ అధికారులు పట్టించుకోలేదు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రావడంతో కొత్తగా ఎమ్మెల్యే అయిన సుందరపు విజయకుమార్ ఏపీఐఐసీ అధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఏపీఐఐసీ ... మిగతా 8వ పేజీలో

జగన్నాథ రథయాత్ర రేపు

- ఆదివారం ఉదయం పది గంటలకు ప్రారంభం
- ఏర్పాట్లు చేసిన ఉత్సవ కమిటీ
- నేడు రుక్మిణి, సత్యభామ, వేణుగోపాలస్వామి కల్యాణం



అనకాపల్లి టౌన్, జూలై 5: జిల్లా కేంద్రమైన అనకాపల్లిలో ఆదివారం సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథస్వామి రథయాత్రకు ఉత్సవ కమిటీ ఏర్పాట్లు పూర్తిచేసింది. స్థానిక గవరపాలెం అగ్గిమర్రి చెట్టు వద్ద కొలువైన జగన్నాథస్వామి ఆలయంలో ఉదయం పది గంటలకు రథయాత్ర ప్రారంభం కానుంది. జగన్నాథ రథయాత్ర వేడుకలు ఈనెల ఆరో తేదీ నుంచి 16వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్టు ఉత్సవ కమిటీ ఛైర్మన్ దాడి బుజ్జి, ఈవో రాజసులోచన తెలిపారు. ఆరో తేదీ రాత్రి ఆలయంలో ప్రధాన అర్చకులు బంకుపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు వారు చెప్పారు. ఆదివారం ఉదయం సుభద్ర బలభద్ర సమేత జగన్నాథస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఉత్సవమూర్తులను రథంపై ఏర్పాటు చేయనున్నారు. ఉదయం పది గంటలకు రథయాత్ర ప్రారంభం కానుంది. ఈ రథయాత్ర గవరపాలెం పురవీధుల గుండా చిననాలుగురోడ్ల జంక్షన్, స్టేషన్‌రోడ్డు, చిననాలుగురోడ్ల జంక్షన్, పెరుగుబజార్, గాంధీబొమ్మ జంక్షన్, మళ్లవీధి మీదుగా గూడ్స్‌షెడ్డు వద్ద గల ఇంద్రజ్యుమ్న హాల్ వరకు సాగుతుంది. అక్కడ ఉత్సవమూర్తులను ఏర్పాటు చేసి నవరాత్రులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. రోజుకొక అవతారంలో స్వామివారు భక్తులకు దర్శనమిస్తారు. ఈనెల 16వ తేదీ తిరుగు రథయాత్ర జరగనుంది. రథయాత్ర సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

విశాఖలో బుజ్జి

- 'కల్కి' కారు సందడి
- నిర్మాణ వ్యయం రూ.7 కోట్లు



ప్రభాస్ పాన్ ఇండియా సినిమా 'కల్కి'లో ఉపయోగించిన కారు 'బుజ్జి' విశాఖపట్నంలో సందడి చేస్తోంది. సినిమా ప్రమోషన్‌లో భాగంగా దానిని రాష్ట్రం అంతటా తిప్పుతున్నారు. శుక్రవారం ఉదయం నగరానికి తీసుకువచ్చి విశాఖ వేలీ స్కూల్ ఆవరణలో ఉంచారు. అక్కడి విద్యార్థులకు దానిని ప్రదర్శించారు. శని, ఆదివారాల్లో మద్దిలపాలెం సీఎంఆర్ సెంట్రల్‌లో ప్రదర్శిస్తారని సమాచారం. ఈ కారు పేరు 'బుజ్జి'. దీనికి అనేక ప్రత్యేకతలు ఉన్నాయి. మహీంద్ర అండ్ మహీంద్ర కంపెనీ ప్రత్యేకంగా తయారు చేసింది. నిర్మాణ వ్యయం రూ.7 కోట్లు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పనిచేస్తుంది. అంటే వాయిస్ కమాండ్ ద్వారా ఆపరేట్ అవుతుంది. బుజ్జి బరువు ఆరు టన్నులు. దీనిని ప్రత్యేకమైన ట్రక్కులో రాష్ట్రమంతటా తిప్పుతున్నారు. ప్రదర్శన ఉన్నచోట కిందికి దించి, శిక్షణ పొందిన నిపుణుల ద్వారా డ్రైవ్ చేయిస్తున్నారు. ఈ కారుకు మూడు టైర్లు ఉన్నాయి. ముందు రెండు, వెనుక ఒకటి. ఇవి హబ్ లెస్ టైర్లు. సియట్ కంపెనీ వీటిని ప్రత్యేకంగా రూపొందించింది. డ్రైవర్‌కు స్పెషల్ సీటింగ్ ఉంది. పైన గ్లాస్ డోమ్. కారు పొడవు 6.075 మీటర్లు. వెడల్పు 3.280 మీటర్లు. ఎత్తు 2.186 మీటర్లు. 94 కిలోవాట్ల సామర్థ్యంతో పనిచేస్తుంది. రెండు రేంజ్ రోవర్ల శక్తితో సమానమని టెక్నీషియన్లు చెబుతున్నారు. దీనిని చూడడానికి యువతీయువకులు చాలా ఆసక్తి చూపిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం విశాఖ వేలీ స్కూల్ ఆవరణలో దీనిని డ్రైవ్ చేసి విద్యార్థులకు చూపించారు. అంతా ఉత్సాహంగా ముందుకు వచ్చి సెల్ఫీలు తీసుకున్నారు.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి

ఒలింపిక్స్‌కు ఎర్రాజీ జ్యోతి

- నగరం నుంచి ఒలింపిక్స్‌కు ఎంపికైన తొలి అథ్లెట్‌గా రికార్డు



విశాఖపట్నం (స్పోర్ట్స్), జూలై 5: నగరానికి చెందిన అథ్లెట్ ఎర్రాజీ జ్యోతి భారత్ తరఫున ఒలింపిక్స్‌లో పాల్గొననున్నది. విశాఖ నుంచి ఒలింపిక్స్‌కు ఎంపికైన తొలి అథ్లెట్‌గా జ్యోతి రికార్డు నెలకొల్పింది. వచ్చే నెల 26 నుంచి పారిస్‌లో జరగనున్న ఒలింపిక్స్‌లో 100 మీటర్ల హర్డిల్స్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహించనుంది. వరల్డ్ అథ్లెటిక్స్ సమాఖ్య విడుదల చేసిన ఆటోమేటిక్ క్వాలిఫికేషన్, కటాఫ్ ర్యాంకింగ్స్‌లో 34వ స్థానంలో నిలిచిన జ్యోతి ఒలింపిక్స్ బెర్తు ఖరారు చేసుకున్నది. భారత్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న పదకొండు (11) మంది అథ్లెట్లలో ఎర్రాజీ జ్యోతి ఒకరు కావడం విశేషం.

100 మీటర్ల హర్డిల్స్‌లో...

టాక్సీ డ్రైవర్ కూతురైన జ్యోతి సాధారణ అథ్లెట్‌గా ట్రాక్ అండ్ ఫీల్డ్‌లోకి అడుగుపెట్టి...క్రమశిక్షణ, చిత్తశుద్ధి, పట్టుదలతో సాధన చేసి దేశం గర్వించదగ్గ స్థాయికి చేరుకుంది. 100 మీటర్ల హర్డిల్స్ ఈవెంట్‌లో జాతీయ స్థాయిలో తన రికార్డులను తానే అధిగమించుకుంటూ దూసుకోపోతోంది. ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ మీట్, ఏషియన్ గేమ్స్, వరల్డ్ యూనివర్సిటీ గేమ్స్‌లో స్వర్ణ, రజత పతకాలు అందుకుంది. త్వరలో పారిస్‌లో జరిగే ఒలింపిక్స్‌లో కూడా దేశానికి పతకం అందించడం ఖాయమని నిపుణులు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు.

క్రైం... crime news

బైక్‌ను ఢీకొన్న లారీ

» తండ్రి మృతి... కొడుక్కి తీవ్ర గాయాలు

రాంబిల్లి, జూలై 5 : మండలంలోని కొత్తూరు మామిడివాడ వద్ద శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఇందుకు సంబంధించి ఇన్‌చార్జి సీఐ దీనబంధు తెలిపిన వివరాలివి. ఎలమంచిలి మండలం సోమలింగపాలేనికి చెందిన పిల్లా నాగరాజు (50), ఆయన కుమారుడు పిల్లా శివ బైక్‌పై కొత్తూరు శుక్రవారం సాయంత్రం వస్తున్నారు. మామిడివాడ వద్దకు చేరేసరికి వీరి వాహనాన్ని లారీ వెనుకనుంచి బలంగా ఢీకొంది. దీంతో ఇద్దరూ తీవ్ర గాయాలకు గురయ్యారు. వెంటనే స్థానికులు ప్రైవేటు వాహనంలో ఎలమంచిలి ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించగా, పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నాగరాజు మృతిచెందగా, శివ చికిత్స పొందుతున్నారు. మృతుడి కుటుంబీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఇన్‌చార్జి సీఐ తెలిపారు.

ఏఎల్ పురంలో వృద్ధుడి ఆత్మహత్య

కృష్ణాదేవిపేట, జూలై 5: కాళ్ల నొప్పులు తాళలేక పురుగుల మందుతాగి ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలిలావున్నాయి. గొలుగొండ మండలం ఏఎల్‌పురం బీసీ కాలనీకి చెందిన ఏకా అప్పలనాయుడు (68) కొంతకాలంగా కాళ్ళ నొప్పు లతో బాధపడుతున్నాడు. గత నెలలో ఎడమకాలుకు శస్త్రచికిత్స చేయించుకున్నారు. అయిన ప్పటికీ బాధ తగ్గకపోగా నొప్పి అధికం కావడంతో మద్యంలో పురుగుల మందు కలుపుకొని గురువారం సాయంత్రం ఆత్మహత్యా యత్నం చేశారు. కుటుంబ సభ్యులు గమనించి కృష్ణాదేవిపేట ప్రాథమిక ఆరోగ్యం కేంద్రానికి, అక్కడ నుంచి నర్సీపట్నం తీసుకెళ్లారు. అనంతరం అక్కడి వైద్యుల సలహా మేరకు కేజీహెచ్‌కు తరలించగా, చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం అప్పలనాయుడు మృతి చెందారు. మృతుడి భార్య నూకాలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ ఉపేంద్ర తెలిపారు.

కాలువలో పడి టైలర్ మృతి

ఎలమంచిలి, జూలై 5: పట్టణంలోని నాగేంద్ర కాలనీలో గల డ్రైనేజీ కాలువలో ప్రమాదవశాత్తు పడి ఓ వ్యక్తి మృతిచెందినట్టు ఏఎస్‌ఐ చెల్లారావు తెలిపారు. కాలువలో మృతదేహం ఉన్నట్టు శుక్రవారం స్థానికులు గుర్తించి తమకు సమాచారం అందించారన్నారు. ఈ మేరకు సిబ్బందితో వెళ్లి మృతదేహాన్ని బయటకు తీయించామన్నారు. పరిశీలించి చూడగా, ఎలమంచిలిలోని నాగేంద్ర కాలనీకి చెందిన జనపరెడ్డి లక్ష్మణరావు (50)గా స్థానికులు గుర్తించారన్నారు. ఇతడు టైలరింగ్ వృత్తి చేసేవాడని, కుటుంబానికి దూరంగా ఉంటున్నాడని వివరించారు. ఇటీవల మద్యం అతిగా సేవించేవాడని, ఆ మత్తులో కాలువలో పడి మృతిచెంది ఉంటాడని తెలిపారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

వరహా నదిలో గుర్తుతెలియని మృతదేహం

ఎలమంచిలి, జూలై 5 : మండలంలోని ఏటికొప్పాక సమీపంలో గల వరహా నదిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం బయటపడినట్టు రూరల్ ఎస్‌ఐ సింహాచలం తెలిపారు. శుక్రవారం స్థానికులు నదిలో మృతదేహం ఉన్నట్టు గుర్తించి తమకు సమాచారం అందించారన్నారు. ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా, సుమారు 50 నుంచి 55 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి అందులో పడి ఉన్నాడన్నారు. మూడు రోజులపైడి నదిలో మృతదేహం ఉన్నట్టు భావిస్తున్నామన్నారు. మృతుడు తెల్ల చొక్కా, పంచె ధరించి ఉన్నాడని, అయితే చొక్కాపై నర్సీపట్నం శ్రీకన్య టైలర్స్ స్టిక్కర్ అని ఉందని వివరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి

అనకాపల్లి టౌన్, జూలై 5: పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ గోల్డ్‌స్మిత్ మృతిచెందినట్టు ఎస్‌ఐ పీవీ రమణ తెలిపారు. ఇందుకు సంబంధించి అందిన ఫిర్యాదు మేరకు ఆయన తెలిపిన వివరాలివి. కశింకోట గ్రామం సాయిబాబా కోవెల వెనుక నివాసముంటున్న గోల్డ్‌స్మిత్ అములోజు నానాజీ (47) అనకాపల్లి పట్టణంలోని కస్పావీధిలో బంగారు వస్తువుల పనులు చేస్తుంటారు. ఈయన గత నెల 30వ తేదీన అతిగా మద్యం సేవించి, సబ్బవరం రోడ్డులోని పాత గోపాలకృష్ణ థియేటర్ సమీపంలో పడిపోయారు. ఇది గుర్తించిన స్థానికులు ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆయనను స్థానిక ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఎస్‌ఐ చెప్పారు. మృతుడి కుమారుడు సునీల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రెండు గంజాయి కేసుల్లో ముగ్గురికి జైలు: ఎస్పీ

కొత్తూరు, జూలై 5: రెండు గంజాయి కేసుల్లో ముగ్గురికి జైలు శిక్షను న్యాయమూర్తి విధించినట్టు అనకాపల్లి జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ శుక్రవారం తెలిపారు. కశింకోట పూసర్లవీధికి చెందిన కొత్తం సూర్యప్రకాశరావు, చోడవరం మండలం ఎడ్ల వీధిలోని పిల్లవారి తోట ప్రాంతానికి చెందిన చొప్ప రమణమ్మకు 10 సంవత్సరాలు జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధించారన్నారు. రెండో కేసుకు సంబంధించి పాడేరు మండలం గుత్తుల పుట్టు గ్రామానికి చెందిన పాంగి సరస్వతికి ఏడాది జైలుశిక్ష, రూ.10వేలు జరిమానా విధిస్తూ అనకాపల్లి న్యాయమూర్తి నందనవనం శ్రీవిద్య తీర్పు ఇచ్చారని ఎస్పీ వివరించారు. కొత్తం సూర్యప్రకాశరావు, చొప్ప రమణమ్మలు 2016 ఆగస్టు 24న తుమ్మపాల ఏలేరు కెనాల్ వద్ద నుంచి కారులో 40 కిలోల గంజాయి తరలిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు అప్పటి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వి.రవికుమార్ మాటువేసి, వారిని పట్టుకుని అరెస్టు చేశారన్నారు. అలాగే, పాంగి సరస్వతి 2015 డిసెంబరు 7న తుమ్మపాల గ్రామం వద్ద బ్యాగులో నాలుగు కిలోల గంజాయిని తరలిస్తూ పట్టుకుని అరెస్టు చేసి కేసు నమోదు చేశారన్నారు. ఈ కేసులకు సంబంధించి అనకాపల్లి పదవ అదనపు జిల్లా జడ్జి కోర్టులో శుక్రవారం వాదనలు విన్నతరువాత జడ్జి శ్రీవిద్య తీర్పును వెల్లడించారని ఎస్పీ తెలిపారు.

10 కిలోల గంజాయితో ముగ్గురి అరెస్టు

» పరారీలో మరో ఇద్దరు నిందితులు

మాడుగుల రూరల్, జూలై 5: ఏజెన్సీ నుంచి పది కిలోల గంజాయి తరలిస్తూ ముగ్గురు వ్యక్తులు శుక్రవారం పట్టుబడ్డారు. ఎస్‌ఐ దామోదర నాయుడు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం ఉదయం పది గంటల సమయంలో ఎం.కోడూరు గ్రామ శివారుల్లో నడుచుకుంటూ వస్తున్న ముగ్గురు వ్యక్తులను ఆపి తనిఖీ చేయగా వారి బ్యాగుల్లో పది కిలోల గంజాయి ప్యాకెట్లు లభ్యమయ్యాయి. బిహార్‌కు చెందిన శ్యామ్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన షాహిల్, రాకేశ్‌లను అరెస్ట్ చేసి నట్టు ఎస్‌ఐ తెలిపారు. గంజాయి రవాణాకు సహకరించిన హర్యానాకు చెందిన సునీల్, పాడేరుకు చెందిన అజయ్ పరారీలో ఉన్నారన్నారు. నిందితుల వద్ద సెల్‌ఫోన్, రూ.700 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

టీడీపీ కార్యకర్తలపై దాడి నిందితులకు రిమాండ్

చీడికాడ, జూలై 5: మండలంలోని అప్పలరాజుపురంలో గురువారం రాత్రి టీడీపీ కార్యకర్తలపై దాడి చేసిన ఘటనలో స్థానిక సర్పంచ్ చుక్క అప్పలనాయుడుతో పాటు మరో 8 మందిని పోలీసులు అరెస్టు చేసి శుక్రవారం అనకాపల్లి జడ్జి ముందు హాజరు పరిచారు. వీరికి న్యాయమూర్తి ఈ నెల 11 వరకు రిమాండ్ విధించారు. శుక్రవారం ఉదయం ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. అప్పలరాజుపురం టీడీపీ కార్యాలయం వద్ద మాడుగుల లోకేష్, స్వామి, కురచా మోదినాయుడు, సూర్యనారాయణలు వారి పార్టీ కార్యక్రమాలపై చర్చిస్తున్నారు. అదే సమయంలో స్థానిక సర్పంచ్ చుక్క అప్పలనాయుడు, కురచా నారాయణమూర్తి, కురచా శ్రీను, బండారు బలరాం, మిడతాడ రామకృష్ణ, చుక్క జగదీష్, అక్కునాయుడు, గేదెల సర్వేశ్వరరావు, రమణలు వారిపై దాడిచేసి కొట్టారన్న ఫిర్యాదు మేరకు శుక్రవారం ఉదయం కార్యాలయం వద్దకు వెళ్లి పరిశీలించామన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	112.00
లైవ్ ధర	132.00
విత్ స్కిన్	234.00
స్కిన్ లెస్	244.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

వ్యాధులతో తస్మాత్ జాగ్రత్త

జంతువుల నుంచి మానవులకు సంక్రమించే రోగాలతో ప్రమాదం

» అప్రమత్తత, ముందు జాగ్రత్త చర్యలతోనే నివారణ సాధ్యం

» నేడు జూనోసిస్ దినోత్సవం

చింతపల్లి, జూలై 5:
భూమి మీది నివసిస్తున్న పక్షులు, జంతువులతో మనుషులు కూడా సంబంధం కలిగి ఉంటారు. తమ అవసరాలకు, ఆహారానికి, ఆనందం కోసం పక్షులు, జంతువులను మచ్చిక చేసుకుంటారు. ఈ తరుణంలో పక్షులు, జంతువుల నుంచి మానవులకు కొన్ని రకాల వ్యాధులు వ్యాప్తి చెందడం ప్రారంభమయ్యాయి. ఈ వ్యాధులను జూనోటిక్(సంక్రమిత) వ్యాధులు అంటారు. పక్షులు, జంతువుల నుంచి మానవులకు సంక్రమించే రోగాలపై ప్రజలు అప్రమత్తం చేసే సదుద్దేశంతో జూలై 6న ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పక్షులు, జంతువుల నుంచి సంక్రమించే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక కథనం.

కుక్కల నుంచి ర్యాబిస్, పశువుల నుంచి క్షయ, అకాల ప్రసవ రోగం, చిన్న జీవాల నుంచి ఆంత్రాక్స్, కోళ్లు, పక్షుల నుంచి బర్డ్‌ఫ్లూ తదితర వ్యాధులు మనుషులకు వ్యాప్తి చెందుతాయి. మానవులు శుభ్రత, టీకాలు, కొన్ని నియమాలు పాటించడం వల్ల ఈ వ్యాధులకు దూరంగా ఉండవచ్చు. ఫ్రెంచ్ జీవశాస్త్రవేత్త లూయిస్ పాశ్చర్ ర్యాబిస్ వ్యాధికి మొదటి వ్యాక్సిన్ కనుగొనడం వల్ల మానవులకు రక్షణ ఏర్పడింది.



ఆంత్రాక్స్ (దొమ్మరోగం)

ఈ వ్యాధి గొర్రెలకు, మేకలకు, పశువులకు సోకుతుంది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఈ వ్యాధి తీవ్రత అధికంగా ఉంది. మట్టి, కబేళలా ద్వారా, నీరు, ఆహారం, బాహ్యపరాన్న జీవుల వల్ల ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. బ్రూసిల్లా ఆంత్రాసిస్ అనే బాక్టీరియా ద్వారా ఈవ్యాధి వ్యాప్తి చెందుతుంది. ఈ బాక్టీరియా స్పోర్స్ మట్టి, నీరు, ఆహారం, బాహ్య పరాన్న జీవుల శరీరంలోకి చేరి వ్యాధికి కారణమవుతాయి. వ్యాధికి గురైన జంతువులలో లక్షణాలు పెద్దగా కనిపించవు. జ్వరంతో అకాలంగా మరణిస్తాయి. చనిపోయిన పశువు ముక్కు, నోరు, మల ద్వారం నల్లని, గడ్డకట్టన రక్తం కారుతుంది. ఈ వ్యాధి సోకి చనిపోయిన పశువులను అవగాహన లేక చర్మం తీయడం, మాంసం కోయడం వల్ల మనుషులకు సోకుతుంది. ఈ వ్యాధి సోకిన మనుషులకు జ్వరం, చేతులు, కాళ్లపై పొక్కులు (కురుపులు) వస్తాయి. ఈ వ్యాధితో మరణించిన పశువులను ఆరు అడుగుల లోతైన గొయ్యిలో సున్నం, ఉప్పు వేసి పాతిపెట్టాలి. ఈ వ్యాధి నివారించేందుకు పశువులకు టీకాలు వేయించాలి. వ్యాధి సోకిన వారికి వైద్యుల పర్యవేక్షణలో యాంటీబయోటిక్ మందులు వాడాలి.

బ్రుసెల్లోసిస్ (అకాల ప్రసవాల వ్యాధి)..



బ్రూసెల్లా వ్యాధి (అకాల గర్భస్రవం)

బ్రుసెల్లోసిస్ వ్యాధి బ్రుసెల్లా అబార్టస్ అనే బాక్టీరియా వల్ల పాడి పశువులు, మేకలు, గొర్రెలకు వ్యాప్తి చెందుతుంది. ఈ వ్యాధి నోటీ ద్వారా, చర్మం, పొదుగు, వీర్యం ద్వారా ఇతర జంతువులకు వ్యాప్తి చెందుతుంది. పశువుల్లో పునరుత్పత్తి సామర్థ్యం తగ్గడం, చనిపోయిన దూడలు పుట్టడం, ఈనిన తరువాత మాయ పడకపోవడం, ఆబోతుల వృషణాలు వాచడం ఈ వ్యాధి లక్షణాలు. ఈ వ్యాధి సోకిన పశువుల యొక్క గర్భాశయ స్రవాలు, చనిపోయిన పిండాలు, వీర్యం తాకడం, పాలు తాడం ద్వారా మనుషులకు ఈవ్యాధి సోకుతుంది. మనుషులలో తరచూ జ్వరం రావడం, చెమటలు పట్టడం, చలి, విపరీతమైన తల నొప్పి, మోకాళ్ల నొప్పులు, గర్భస్రవాలు, పునరుత్పత్తి సామర్థ్యం లోపించడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ వ్యాధి నివారించేందుకు కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహాయంతో మన రాష్ట్రంలో బ్రుసిల్లా వ్యాధి నివారణ పథకం(ఎన్‌సీపీబీ) పథకం ద్వారా 4-8 నెలల వయసులో ఉన్న ఆడ దూడలకు టీకాలు ఉచితంగా వేస్తున్నారు.



ర్యాబీస్ (కుక్క కాటు వ్యాధి)



లిస్సా అనే వైరస్ వల్ల ర్యాబీస్ వ్యాధి సోకుతుంది. ఇది జంతువులలో, మనుషులలో కూడా ప్రాణంతమైన వ్యాధి. ఈ వ్యాధి సోకిన కుక్కలు మనుషులను, ఇతర జంతువులను కరవడం వల్ల వ్యాధి వ్యాపిస్తుంది. అకాల మరణం, వెలుతురు చూడలేకపోవడం, నీరు చూసి భయపడడం, అందరినీ కరవడం ఈ వ్యాధి ప్రధాన లక్షణాలు. ఈ వ్యాధి కలిగిన కుక్క మనుషులు, ఇతర జంతువులకు కరిస్తే చొంగ (ఉమ్మి) ద్వారా వైరస్ మనిషిలోకి ప్రవేశించి నాడీ వ్యవస్థను దెబ్బతీస్తుంది. వ్యాధి సోకిన మనుషుల్లో చొంగ కార్చడం, జ్వరం, అరుపులలో మార్పు రావడం ప్రధాన లక్షణాలు. ఈ వ్యాధికి చికిత్సలేదు. వ్యాధిని నిరోధించేందుకు ప్రతీ ఏటా పెంపుడు కుక్కలకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి. మానవులకు కుక్క కాటువేస్తే వెంటనే గాయానికి శుభ్రంచేసి ప్రథమ చికిత్స చేసి వైద్యులను సంప్రదించాలి. వైద్యుల సలహా మేరకు కుక్క కరిచిన 0, 3, 7, 14 రోజుల్లో టీకాలు వేయించుకోవడం శ్రేయస్కరం.

బర్డ్‌ఫ్లూ..




కోళ్లలో బర్డ్‌ఫ్లూ

బర్డ్‌ఫ్లూ వ్యాధి ఇన్‌ఫ్లూయెంజా వైరస్ వల్ల వస్తుంది. హాంకాంగ్‌లో ప్రారంభమైన ఈ వ్యాధి ప్రపంచమంతా అనాతి కాలంలోనే వ్యాప్తి చెందింది. కోళ్లు, పక్షుల నుంచి ఈ వ్యాధి మనుషులకు సోకుతుంది. ప్రాణంతకమైన ఈ వ్యాధి సోకిన కోళ్లలో జలుబు, దగ్గు, ఆయాసం, జ్వరం, తుమ్ములు, గుడ్లు పెట్టే సామర్థ్యం తగ్గడం, నీరసం తదితర లక్షణాలు కనిపిస్తాయి. ఈ వ్యాధి సోకిన కోళ్లను తాకడం వల్ల మనుషులకు సోకుతుంది. వ్యాధి సోకిన మనుషుల్లో జలుబు, దగ్గు, జ్వరం, నిమోనియా, గొంతునొప్పి, ఛాతి నొప్పి వంటి లక్షణాలు కనిపిస్తాయి. వ్యాధి వల్ల మానవుల ప్రాణానికి ప్రమాదం కలుగుతుంది. వ్యాధి సోకిన మానవులు సకాలంలో చికిత్స పొందాలి. ఈ వ్యాధి కోళ్లలో అరికట్టేందుకు శుభ్రత పాటించడంతో పాటు ఫారంలో బయో సెక్యూరిటీ వ్యవస్థను పాటించాలి.

పశు వైద్యశాలల్లో ఉచితంగా టీకాలు



ప్రపంచ జూనోసిస్ దినోత్సవం పురస్కరించుకుని శనివారం ప్రతీ పశువుల ఆస్పత్రిలో ఉచితంగా ర్యాబీస్ టీకాలు వేయడం జరుగుతుంది. పెంపుడు కుక్కలను ప్రజలు బాధ్యతగా పశువుల ఆస్పత్రికి తీసుకువెళ్లి టీకాలు వేయించాలి. ఈ టీకాలు వేయించడం వల్ల ర్యాబిస్ వ్యాధిని నివారించవచ్చు. పశువైద్యుల సలహాలు, సూచనలు పాటిస్తూ పెంపుడు జంతువులకు వివిధ సమయాల్లో క్రమంగా టీకాలు వేయించాలి. **-డాక్టర్ విజయ రాజ్జీ,**
పశువైద్య శాస్త్రవేత్త, కేవీకే, హరిపురం.

చక్కని సేవలతో జిల్లా ప్రజల మనసు గెలి‘సారు’

» కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి వీడ్కోలు సభలో కొనియాడిన వక్తలు

» తన మార్కు అభివృద్ధిని చూపారని కొత్త కలెక్టర్ విజయకృష్ణన్ ప్రశంసలు

» ఘనంగా సత్కరించిన వివిధ శాఖల అధికారులు



బదిలీపై వెళుతున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి సత్కార సభలో కొత్త కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ మురళీకృష్ణ, అధికారులు

అనకాపల్లి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కొత్తగా ఏర్పడిన అనకాపల్లి జిల్లాలో కలెక్టర్‌గా రవి పట్టన్‌శెట్టి చక్కని సేవలందించి ప్రజలందరి మన్ననలు పొందారని నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన విజయకృష్ణన్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ఉద్యోగులు శుక్రవారం ఏర్పాటు చేసిన బదిలీపై వెళుతున్న రవి పట్టన్‌శెట్టి వీడ్కోలు సభలో ఆమె ముఖ్య అతిథిగా ప్రసంగించారు. జిల్లా అభివృద్ధిలో రవి పట్టన్‌శెట్టి తన మార్కును చూపారన్నారు. ఎస్పీ కేవీ మురళీకృష్ణ మాట్లాడుతూ కలెక్టర్‌గా రవి పట్టన్‌శెట్టి పోలీసు, రెవెన్యూ ఇతర శాఖల ఉద్యోగులు సమన్వయంతో పనిచేసే విధంగా ప్రోత్సాహం అందించారని పేర్కొన్నారు. జేసీ జాహ్నవి మాట్లాడుతూ కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి తనకు అన్ని విధాలా సూచనలు, సలహాలు ఇచ్చి సహకరించారని వివరించారు. వివిధ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు రవి పట్టన్‌శెట్టి సేవలను కొనియాడారు. అనంతరం జిల్లా అధికారులు ఆయనకు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు.

జిల్లాకు 11,660 ర్యాబీస్ వ్యాక్సిన్ డోసులు

» నేడు పెంపుడు కుక్కలకు ఉచితంగా ఇంజక్షన్

» పశు సంవర్ధక శాఖ ఏడీ రాంబాబు



డాక్టర్ రాంబాబు

నర్సీపట్నం, జూన్ 6 : జూనోసిస్ డే సందర్భంగా నర్సీపట్నం పశు సంవర్ధక శాఖ కార్యాలయం, పశువుల ఏరియా ఆస్పత్రుల వద్ద శనివారం పెంపుడు కుక్కలకు ఉచితంగా ఆ్యబీస్ వ్యాక్సిన్ వేయనున్నట్టు పశుసంవర్ధక శాఖ ఏడీ డబ్ల్యూ రాంబాబు తెలిపారు. జిల్లాకు 11,660 డోసులు మంజూరు అయ్యాయని తెలిపారు. 13 పశు సంవర్ధక శాఖ సబ్ డివిజన్ కార్యాలయాలు, అన్ని పశు వైద్య కేంద్రాలలో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి వ్యాక్సిన్లు వేయడం జరుగుతుందని ఆయన చెప్పారు. రేబీస్ ఉన్న కుక్క కరవడం వల్ల ఆ వ్యాధి మనుషులు, ఇతర జంతువులకు సోకుతుందన్నారు. కుక్క కరిచిన ఏడు రోజుల నుంచి నాలుగేళ్లలోపు ఎప్పుడైనా ఈ వ్యాధి లక్షణాల కనిపించే అవకాశాలు ఉంటాయన్నారు. జ్వరం, తలనొప్పి, గొంతునొప్పి, మింగలేక పోవడం, నీటిని చూస్తే భయపడటం, పిచ్చిగా ప్రవర్తించడం వ్యాధి లక్షణాలుగా పేర్కొన్నారు. కుక్క కరిచిన వ్యక్తి ఐదు డోసులు యాంటీ రేబీస్ వ్యాక్సిన్ తీసుకోవాల్సి ఉంటుందని అన్నారు. ఈ విషయంలో ఎంతమాత్రం నిర్లక్ష్యం వహించినా ప్రాణాల మీదకు తెచ్చుకున్నట్టేనని స్పష్టం చేశారు.

మోటూరుపాలెంలో విజృంభిస్తున్న అతిసార

నాలుగు రోజుల క్రితం తొమ్మిది మందికి వాంతులు, విరేచనాలు

వివిధ ఆస్పత్రుల్లో చేరిన మరో 18 మంది బాధితులు

గ్రామాన్ని పరిశీలించి, రోగులను పరామర్శించిన ఎమ్మెల్యే సుందరపు



రోగులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

అచ్యుతాపురం, జూలై 5 : మండలంలోని మోటూరుపాలెంలో అతిసార విజృంభిస్తోంది. తాజాగా గ్రామానికి చెందిన మరో 18మంది ఈ వ్యాధిబారిన పడగా, చికిత్సలు పొందుతూ వీరిలో ఆరుగురు కోలుకుని ఇళ్లకు చేరారు. మిగిలినవారు అచ్యుతాపురం, అనకాపల్లి, విశాఖ కేజీహెచ్‌లలో చికిత్సలు పొందుతున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలివి. నిల్వ ఉన్న ఆహారం తిన్న కారణంగా మంగళవారం రాత్రి ఓ కుటుంబంలోని తొమ్మిది మంది వాంతులు, విరేచనాలతో తీవ్ర అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. తొలుత వీరు అచ్యుతాపురంలో గల ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్సలు పొందారు. అయినప్పటికీ నయం కాకపోవడంతో అచ్యుతాపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇక్కడ కొందరికి చికిత్సలు అందించిన అనంతరం ఐదుగుర్ని అనకాపల్లి ఎన్‌టీఆర్ వైద్యాలయానికి తరలించారు. వీరిలో కొందరు గురువారం సాయంత్రం డిశ్చార్జి అయి ఇళ్లక చేరారు.

కాగా, గురువారం రాత్రి మరో 18 మంది వాంతులు, విరేచనాలతో బాధపడుతూ ఇక్కడి ప్రభుత్వ ఆసుపత్రికి విచ్చేశారు. ప్రాథమిక చికిత్సల అనంతరం వీరిలో విశాఖ కేజీహెచ్‌కు ఐదుగుర్ని, అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి ముగ్గుర్ని తరలించారు. నాలుగురికి ఇక్కడే చికిత్సలు అందిస్తుండగా, మిగిలినవారంతా కోలుకుని ఇళ్లకు చేరుకున్నారు.

ఇదిలావుంటే, మోటూరుపాలెం ఎస్సీ కాలనీలో 52 గృహాలు ఉండగా, అక్కడ 42 గృహాలకు మరుగు దొడ్లు లేవు, వీరు బహిర్భూమికి ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా ఇంటి వెనుకదడులు ఏర్పాటుచేసుకొని వినియోగిస్తున్నారు. దీని వల్ల ఈ వ్యాధి ఇతరులకు సోకుతోందని వైద్యబృందం తెలిపారు.

ఎమ్మెల్యే పరామర్శ

గ్రామంలో అతిసార విజృంభిస్తున్న విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ గురువారం రాత్రి నుంచి పరిస్థితిని ఎప్పటి కప్పుడు తెలుసుకుంటున్నారు. శుక్రవారం ఆయన మోటూరుపాలెంలో పర్యటించారు. పారిశుధ్య పనులు సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయం, విశాఖ కేజీహెచ్‌కు వెళ్లి రోగులను పరామర్శించారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులను కోరారు. కాగా, తహసీల్దార్ సరోజిని, ఎంపీడీవో సురేష్ కుమార్, అచ్యుతాపురం ఆస్పత్రి వైద్య బృందం సదరు గ్రామాన్ని సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. నాయకులు బైలపూడి శ్రీరామదాసు, లాలం చందు, జనపరెడ్డి శ్రీనివాసరావు, తుమ్మల రాజు, నీరుకొండ నర్సింగరావులు ఎమ్మెల్యేతో కలిసి వెళ్లి గ్రామస్థుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.

నారు వేసే ముందు విత్తన శుద్ధి తప్పనిసరి

జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు

కొత్తూరు, జూలై 5: వరి నారు వేసే ముందు రైతులు విత్తన శుద్ధి చేయాలని జిల్లా వ్యవసాయాధికారి జి.మోహన్‌రావు సూచించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విత్తనాల బస్తా కొనుగోలు చేసిన రైతులు వంద గింజలను తీసుకొని మొలక కట్టి, మొలక శాతాన్ని పరీక్షించాలన్నారు. 80 శాతానికి మించి మొలకకడితే మంచి విత్తనంగా పరిగణించవచ్చునన్నారు. విత్తన శుద్ధికి కిలో విత్తనాలకు మూడు గ్రాముల కార్బెండిజం 50శాతం మందును కలిపి 24 గంటల తరువాత నారుమడిలో చల్లుకోవాలన్నారు. దంప నారుమళ్లకైతే లీటరు నీటికి ఒక గ్రాము కార్బెండిజం యాభై శాతం మందును కలిపి, ఆ ద్రావణంలో విత్తనాలను 24 గంటలు నానబెట్టి 24 గంటలు మండకట్టి మొలకెత్తిన విత్తనాన్ని దంప నారు మడిలో చల్లుకోవాలని ఆయన సూచించారు.

భోజనంలో నాణ్యత లోపిస్తే సహించం

కస్తూర్బాగాంధీ విద్యాలయాన్ని తనిఖీ చేసిన హోం మంత్రి అనిత

రాత్రి విద్యార్థినులు భోజనం చేసే సమయంలో రాక

ఆహారం నాణ్యత పరిశీలన.. సమస్యలపై ఆరా



విద్యార్థినుల సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి అనిత

ఎస్.రాయవరం, జూలై 5: మండలంలోని అడ్డరోడ్డు తిమ్మాపురంలో గల కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని శుక్రవారం రాత్రి హోం మంత్రి వంగలపూడి అనిత తనిఖీ చేశారు. విద్యార్థినులు భోజనం చేస్తున్న సమయంలో ఇక్కడికి విచ్చేసిన ఆమె వారితో మాట్లాడారు. భోజనం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. వంటకాలను పరిశీలించి, రుచి చూశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినులకు వండిపెట్టే భోజనాల్లో నాణ్యత లోపించినా, పరిసరాల పరిశుభ్రత పాటించకపోయినా చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. అలాగే విద్యార్థినులకు చక్కగా విద్యాబోధన చేయాలని, మంచి ఫలితాలు సాధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం ఆమె విద్యాలయంలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సమస్య ఉందని, ప్రహరీ గోడ లేక ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థినులు మంత్రికి వివరించారు. సమస్యలను పరిష్కరిస్తామని వారికి ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధం, మాజీ అధ్యక్షుడు ఎన్.వెంకటరాజు, గుర్రం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం తహసీల్దార్ చెలమయ్య మృతి



చెలమయ్య (ఫైల్ ఫొటో)

సబ్బవరం, జూలై 5: సబ్బవరం తహసీల్దార్ జె.చలమయ్య గురువారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. ఎన్నికల ముందు బాధ్యతలు స్వీకరించిన కొద్ది రోజుల తరువాత అనారోగ్యం కారణంగా రెండు నెలలు సెలవు పెట్టారు. దీంతో పరవాడ తహసీల్దార్‌ను ఇన్ చార్జిగా నియమించారు. అయితే చెలమయ్య పరిస్థితి విషమించడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందినట్టు డిప్యూటీ తహసీల్దార్ వెంకట్ తెలిపారు. తహసీల్దార్ మృతికి మండల పరిషత్ ప్రజా ప్రతినిధులు, అధికారులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఆయన మృతికి ఎంపీపీ బోకం సూర్యకుమారి, సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, బోకం రామునాయుడు, కొటాన రాము, గండి రవికుమార్, కర్రి బాబు, పాలిశెట్టి సురేశ్‌రాజ్, యడ్ల నాయుడు బైలపూడి రామారావు, ఐడి బాబు, బోను నాయుడు సంతాపం ప్రకటించారు.

ఆరు నెలలుగా నా భర్త కనిపించడం లేదు

- హోం మంత్రి అనిత వద్ద 'పేట'కు చెందిన మహిళ కన్నీటి పర్యంతం
- రేషన్ పంపిణీ చేసే వాహనం ఆపరేటర్‌గా పనిచేసేవాడని వెల్లడి
- విచారణ జరిపి తన పిల్లలకు న్యాయం చేయాలని వేడుకోలు



బాధితురాలి ఫిర్యాదును పరిశీలిస్తున్న మంత్రి అనిత

పాయకరావుపేట, జూలై 5 : విధులకు వెళ్లిన తన భర్త ఆరు నెలలుగా కనిపించడం లేదని, విచారణ జరిపి న్యాయం చేయాలని పట్టణానికి చెందిన ఓ మహిళ హోం మంత్రి వంగలపూడి అనితకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఇక్కడికి విచ్చేసిన మంత్రికి పట్టణానికి చెందిన మాడుగుల లక్ష్మి కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన భర్త మాడుగుల రమణ మండలంలోని రాజవరం రేషన్ బియ్యం పంపిణీ చేసే వాహనం ఆపరేటర్‌గా పనిచేస్తుండేవాడన్నారు. ఈ ఏడాది జనవరిలో ఇంటి నుంచి విధులకు వెళుతున్నానని చెప్పి బయటకు వెళ్లిన ఆయన, ఇంతవరకు ఇంటికి చేరలేదని వాపోయారు. దీనిపై ఆయనతో పనిచేసే వ్యక్తిని అడిగితే తనకు తెలియదని చెప్పాడని, ఎంత వెతికినా తన భర్త జాడ కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పాయకరావుపేట పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. సుమారు ఆరు నెలలు కావస్తున్నా తన భర్త జాడ తెలియలేదని, తన ఇద్దరు పిల్లలు తండ్రి కోసం రోజూ ఎదురు చూస్తూ రోధిస్తున్నారని కన్నీటి పర్యంతమైంది. దీనిపై స్పందించిన మంత్రి అనిత సీఐ పి.అప్పలరాజు నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తక్షణం విచారణ చేయించి, త్వరలో న్యాయం చేస్తానని బాధితురాలికి మంత్రి హామీ ఇచ్చారు.

ఏపీఐఐసీ భూమి స్వాధీనం

... 5వ పేజీ తరువాయి

సేకరించిన భూముల్లో ఏర్పాటైన కర్మాగారాల వివరాలు సేకరించారు. అలాగే వైసీపీ నాయకుడు ఆక్రమించిన పదెకరాల స్థలం గురించి ప్రస్తావనకు వచ్చింది. దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఏపీఐఐసీ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. దీంతోస్థలాన్ని ఏపీఐఐసీ అధికారులు యుద్ధప్రాతిపదికన ఖాళీ చేయిస్తున్నారు. ఇదిలా ఉండగా లంక ధర్మవరంలో సుమారు ఏడెకరాల దేవాలయ భూమిని వైసీపీ నాయకులు, రెవెన్యూ అధికారులు, ధర్మకర్తల మండలిలో కొందరు కలిసి తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి రియల్టర్‌కి విక్రయించేశారు. ఇక్కడ ఎకరా రూ.రెండు కోట్లు పలుకుతుండగా.. ఎకరా కేవలం రూ. 12 లక్షలకే విక్రయించేశారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో ఇటీవల కథనం రావడంతో రికార్డులు పరిశీలించి, వివరాలు తనకు చూపించాలంటూ ఎమ్మెల్యే విజయకుమార్ తహసీల్దార్‌ను ఆదేశించారు. ఇలా వైసీపీ నాయకుల అక్రమాలపై ఎమ్మెల్యే చర్యలు తీసుకుంటుండడంతో అప్పట్లో నేతలకు సహకరించిన అధికారుల వెన్నులో దడ మొదలైంది.

ఆడపిల్లలు ఆత్మస్థైర్యంతో ఉండాలి

... 5వ పేజీ తరువాయి

పరిసర ప్రాంతంలో గంజాయి సేవిస్తున్న కొంతమంది యువకులు ఆడపిల్లల్ని ఇబ్బంది పెడుతున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. ఆడపిల్లలను ఇబ్బంది పెట్టేవారిని ఉపేక్షించేదిలేదని, కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పాఠశాల పరిసరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేశామన్నారు. ఈ ప్రాంతంలో పోలీసుల నిఘా పెట్టామని, ఆడపిల్లలకు పూర్తి రక్షణ కల్పిస్తామన్నారు. పలువురు విద్యార్థులు పాఠశాలల్లో వసతి, సిబ్బంది కొరత, ల్యాబ్ లేదని, భోజనం సరిగా లేదని పలు సమస్యలు తెలిపారని, వీటి పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. ఆమె వెంట సీఐ పి.అప్పలరాజు, ఎంఈఓలు కేఎన్.గాంధీ, రమేష్, తహసీల్దారు సూర్యనారాయణ, ఎంపీడీఓ కె.స్వప్న, ఈఓ పీఆర్డీ సీహెచ్.చంద్రశేఖర్, టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, పట్టణ పార్టీ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, నాయకులు బొంది కాశీవిశ్వనాథం, యాళ్ల వరహాలు, గొర్రెల రాజబాబు, మజ్జూరి నారాయణరావు, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు ఉన్నారు.

రూఫ్‌టాప్ సోలార్‌పై ప్రత్యేక దృష్టి

... 5వ పేజీ తరువాయి

నిరాటంకంగా విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రత్యేకంగా 900 ఫీడర్లు ఏర్పాటుచేస్తున్నామని సీఎండీ వివరించారు. ఇప్పుడు గ్రామాలకు కూడా త్రీ ఫేజ్ విద్యుత్ ఇవ్వడానికి ఫీడర్లు మారుస్తున్నామని, ఓవర్‌లోడ్ ఫీడర్లు కూడా గుర్తించి కొత్తవి వేస్తామని, వీటికి కేంద్ర పథకమైన ఆర్‌డీఎస్‌ఎస్ ద్వారా రూ.1,600కోట్లు వెచ్చించనున్నామని చెప్పారు.

రూ.150 కోట్లతో ఏజెన్సీలకు విద్యుత్ వెలుగులు

రూ.150 కోట్లతో గిరిజన గ్రామాల్లో విద్యుత్ వెలుగులు నింపాలని శ్రీకాకుళం జిల్లా సీతంపేట నుంచి పశ్చిమ గోదావరి జిల్లా కేఆర్ పురం వరకు 35 వేల ఇళ్లను గుర్తించామన్నారు. వాటిలో 32 వేల ఇళ్లకు ఇప్పటికే విద్యుత్ కనెక్షన్లు ఇచ్చి, మీటర్లు కూడా పెట్టామన్నారు. ఇవన్నీ ఉచిత సర్వీసులేనని గుర్తుచేశారు.

త్వరలో స్మార్ట్ మీటర్లు

కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు త్వరలో స్మార్ట్ మీటర్లు అందుబాటులోకి తీసుకురానున్నట్టు చెప్పారు. మొత్తం పది లక్షల వరకు అవసరం అవుతాయని అంచనా వేశామన్నారు. తొలి దశలో 3 వేల ఫీడర్లు, 1.3 లక్షల ట్రాన్స్‌ఫార్మర్లు, ఆ తరువాత 1.4 లక్షల ప్రభుత్వ సర్వీసులు, ఆపై వాణిజ్య, పరిశ్రమలకు ఈ స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తామన్నారు. ఆ తరువాత ఎక్కువ విద్యుత్ వినియోగించే వారికి ఇస్తామన్నారు. తక్కువ విద్యుత్ వాడేవారికి, ఉచిత విద్యుత్ తీసుకునేవారికి ఈ మీటర్ల అవసరం ఉండదన్నారు. ఇవి ప్రీపెయిడ్ విధానంలో పనిచేస్తాయన్నారు. వీటిని అమర్చిన తరువాత రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల వరకు విద్యుత్ కోతలు విధించకూడదని, డిస్‌కనెక్ట్ చేయకూడదని కేంద్రం ఆదేశించిందన్నారు. ఈ సమయాన్ని 'హ్యాపీ అవర్స్'గా ప్రకటించిందన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ

రాంబిల్లి, జూలై 5 : సీజనల్ వ్యాధులపై అంతా అప్రమత్తంగా ఉండాలని దిమిలి పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణాధికారి ఎస్‌ఎస్‌వీఎస్ రాజు అన్నారు. శుక్రవారం కట్టుబోలు, మురకాడ గ్రామాల్లో నిర్వహించిన అవగాహన ర్యాలీలో మాట్లాడారు. ఆరోగ్య పర్యవేక్షకులు ధనరాజు, పి.వనిత, ఎంఎల్‌హెచ్‌పీ కుమారి, సిహెచ్.నీలవేణి, పిహెచ్‌సీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు,పాల్గొన్నారు.

ముందస్తు ప్రణాళికతో విద్యా బోధన

- శిక్షణ శిబిరంలో ఉపాధ్యాయులకు ఆర్‌జేడీ సూచన

కశింకోట, జూలై 5 : విద్యార్థులకు ముందస్తు ప్రణాళికతో బోధన చేయాలని రీజనల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్‌జేడీ) విజయభాస్కర్ సూచించారు. స్థానిక డీపీఎస్ హైస్కూలులో జరుగుతున్న టీచ్ టూల్ శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీచ్ టూల్ ముఖ్య ఉద్దేశాన్ని, లక్ష్యాలను ఉదాహరణలతో విశదీకరించారు. విద్యార్థులను ఎంతగా గౌరవించాలో తెలియజేశారు. కోర్సు డైరెక్టర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.ఆర్.వి.అప్పారావు, ఎంఈవో-2 కె.ఎస్.ఎన్.మూర్తి, ఎంఐ ఆర్ కో- ఆర్డినేటర్ శ్రీలక్ష్మి, జిల్లా కో-ఆర్డినేటర్ నీతిక్, మాస్టర్ ట్రైనీలు నారాయణరావు, నూకేష్, అచ్యుతకృష్ణ, వేణుగోపాల్, శ్రీరామమూర్తి, ఫణీంద్రకుమార్ పాల్గొన్నారు.



ఉపాధ్యాయుల శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న ఆర్‌జేడీ విజయభాస్కర్

లంకెలపాలెం బంకు వద్ద డివైడర్ మూసివేత

- శ్రీరామ్‌నగర్ కాలనీ వాసులు ఆందోళన
- భారీగా స్తంభించిన ట్రాఫిక్



రహదారిపై ఆందోళన చేస్తున్న శ్రీరామ్‌నగర్ కాలనీ వాసులు

లంకెలపాలెం, జూలై 5 : జాతీయ రహదారి లంకెలపాలెం పెట్రోల్ బంకు వద్ద డివైడర్ మూసివేతపై శ్రీరామ్‌నగర్ కాలనీ వాసులు శుక్రవారం సాయంత్రం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మూతవేత పనులను అడ్డుకున్నారు. ఎన్‌హెచ్‌ఏఐ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గత 30 ఏళ్లుగా ఓపెన్‌గా ఉన్న డివైడర్‌ను మూసి వేస్తే కాలనీ వాసులు ఇళ్లకు ఏవిధంగా చేరుకుంటారని ప్రశ్నించారు. గాజువాక మార్గంలో వచ్చే వాహనాలు లంకెలపాలెం జంక్షన్‌కు వెళ్లి యూటర్న్ తీసుకొని రావాల్సి ఉందన్నారు. దీని కారణంగా జంక్షన్‌లో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. డివైడర్‌ను మూసివేస్తే కాలనీ వాసులతో పాటు ఫార్మాసిటీ పునరావాస కాలనీలు, వినాయకనగర్ వాసులు రాంగ్ రూట్‌లో ప్రయాణించే అవకాశం ఉందని దీని కారణంగా ప్రమాదాలు జరుగుతాయన్నారు. తక్షణమే డివైడర్‌కు అడ్డంగా పెట్టిన సిమెంట్ దిమ్మలను తొలగించాలని డిమాండ్ చేశారు. సుమారు గంటపాటు వాహనాల రాకపోకలను అడ్డుకోవడంతో జాతీయ రహదారి, పరవాడ రహదారిలో ట్రాఫిక్ నిలిచి పోయింది. పోలీసులు అక్కడికి చేరుకొని ఆందోళన కారులతో మాట్లాడారు. కాలనీ వాసులకు ఇబ్బంది లేకుండా చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

చెరువులో పడి కూలీ మృతి



సత్తిబాబు (ఫైల్)

నక్కపల్లి, జూలై 5 : మండలంలోని ఎన్.నర్సాపురం గ్రామానికి చెందిన వ్యక్తి ప్రమాదవశాత్తూ ఉపమాక చెరువులో పడి మృతి చెందినట్టు ఎస్‌ఐ సన్నిబాబుతెలిపారు. ఎన్.నర్సాపురం గ్రామానికి చెందిన మనబాల సత్తిబాబు (56) గురువారం ఉపమాకలో పనికోసం వెళ్లి సాయంత్రం తిరిగి వచ్చేటప్పుడు అక్కడి చిన్న చెరువులో స్నానానికి దిగాడు. ప్రమాదవశాత్తూ మునిగిపోయాడు. తోటి కూలీలు అతనిని బయటకు తీయగా, అప్పటికే మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ చెప్పారు.

కుక్కల దాడిలో రెండు గొర్రెలు మృతి

- మరో నాలుగింటి పరిస్థితి విషమం



మృతిచెందిన గొర్రెలు

కోటవురట్ల, జూలై 5: మండలంలోని ఓ గ్రామంలో ఊర కుక్కల దాడిలో రెండు గొర్రెలు మృతి చెందగా, మరో నాలుగింటి పరిస్థితి విషమంగా ఉంది. ఇందుకు సంబంధించిన వివరాలివి. రాజుపేట గ్రామానికి చెందిన భరణికి సింహాచలం గొర్రెలను పెంచుతూ జీవనోపాధి పొందుతున్నాడు. తనకు ఉన్న పది గొర్రెలను వేరొక వ్యాపారికి రూ.50వేలకు అమ్మకం పెట్టాడు. ఇంతలోనే శుక్రవారం సాయంత్రం సింహాచలం ఇంటివద్ద ఉన్న గొర్రెల మందపై ఒక్కసారిగా కుక్కలు దాడి చేశాయి. దీంతో రెండు గొర్రెలు అక్కడికక్కడే మృతిచెందాయి. మరో నాలుగు గొర్రెలను తీవ్రంగా గాయపర్చాయి. ఈ సమాచారం తెలుసుకున్న తంగేడు పశువుల ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ ప్రతాప్‌కుమార్ గ్రామానికి చేరుకుని గాయపడిన గొర్రెలకు చికిత్సలు అందించారు. ప్రస్తుతం వాటి పరిస్థితి విషమంగా ఉన్నట్టు చెప్పారు. ఈ ఘటనలో యాభై వేల రూపాయల వరకు నష్టం జరిగిందని బాధితుడు వాపోతున్నారు. గ్రామంలో కుక్కల బెడద అధికంగా ఉందని, వెంటనే అధికారులు చర్యలు చేపట్టాల్సిందిగా గ్రామస్థులంతా కోరుతున్నారు.

అట్రాసిటీ మోనటరింగ్ కమిటీల ఏర్పాటుకు వినతి



కలెక్టర్ విజయకృష్ణన్‌తో మాట్లాడుతున్న ప్రతినిధులు

తుమ్మపాల, జూలై 5 : ఎస్సీ ఎస్టీ వర్గాల హక్కుల పరిరక్షణ, సంక్షేమానికి అట్రాసిటీ మోనటరింగ్ కమిటీలను ఏర్పాటు చేయాలని నేషనల్ ఫోరమ్ ఫర్ సోషల్ జస్టిస్ జిల్లా కమిటీ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కొల్లి చినఅప్పారావు మాట్లాడుతూ డివిజన్ స్థాయిలో మోనటరింగ్ కమిటీలను ఏర్పాటు చేయడం ద్వారా బలహీనవర్గాలకు న్యాయం జరుగుతుందని వివరించారు. గతంలో నియమించిన కమిటీల్లో పలు కులాలకు ప్రాధాన్యం లేకుండా పోయిందని వాపోయారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు బొడ్డేడ అప్పారావు, కట్టమూరి మంగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఏఆర్‌ఎస్ ఉద్యోగుల సమస్యలపై వినతి



ఎమ్మెల్యే కొణతాలను కలిసిన ఉద్యోగులు

అనకాపల్లి టౌన్, జూలై 5 : స్థానిక వ్యవసాయ పరిశోధనా కేంద్రం ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు శుక్రవారం ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణను మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యలను విన్నవించారు. ఉద్యోగులకు 12వ పీఆర్‌సీ, డీఏ బకాయిలు అమలు చేయాలని కోరారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు చేయాలని వినతిపత్రంలో విజ్ఞప్తి చేశారు. సంఘ ప్రతినిధులు కె.కాశీనందీశ్వరరావు, వారాది సత్యనారాయణ, ఏవీఎన్ అప్పారావు, కె.జగన్మోహనరావు, కనకఅప్పారావు తదితరులు పాల్గొన్నారు.


ఎలమంచిలి బస్టాండ్‌లోకి ఎక్స్‌ప్రెస్‌లు నడపాలని వినతి



మునిసిపల్ అధికారికి వినతిని అందిస్తున్న నాయకులు

ఎలమంచిలి, జూలై 5 : నియోజకవర్గ కేంద్రం ఎలమంచిలిలోని బస్టాండ్‌కు ఎక్స్‌ప్రెస్ బస్సులు నడపాలని కోరుతూ శుక్రవారం మునిసిపల్ అధికారిని కూటమి నాయకులు కోరారు. ఈ మేరకు జనసేన పట్టణ అధ్యక్షుడు బొద్దపు శ్రీను ఆధ్వర్యంలో వారు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. బస్టాండ్‌లోకి గతంలో వలే ఎక్స్‌ప్రెస్ బస్సులు నడపాలని కోరగా, బస్టాండ్‌కు వెళ్లే ఇన్‌గేట్ వద్ద విగ్రహం దిమ్మ అడ్డుగా ఉండడం వల్ల సాధ్యం కావడం వలేదని డిపో అధికారులు తెలిపారన్నారు. వేలాది మంది ప్రజలు ఎలమంచిలి నుంచి వివిధ ప్రాంతాలకు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారని, వారిని దృష్టిలో పెట్టుకుని బస్సులు వచ్చేలా ఏర్పాట్లు చేపట్టాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు గొర్లె నానాజీ, లవుడు లోవరాజు, గుప్తా, బొద్దపు శ్రీను, పల్లా సత్యనారాయణ, కరణం రవి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దృష్టికి గెస్ట్ లెక్చరర్ల సమస్యలు



ఎమ్మెల్యేకు వినతి అందిస్తున్న గెస్ట్ లెక్చరర్లు

అచ్యుతాపురం, జూలై 5 : సమస్యలు పరిష్కరించాలంటూ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న గెస్ట్ లెక్చరర్లు శుక్రవారం ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్‌ను కోరారు. ఈ మేరకు శుక్రవారం ఇక్కడ ఆతనిని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. కళాశాలల్లో పర్మినెంట్ ఉద్యోగులతో సమానంగా తాము విధులు నిర్వహిస్తున్నా గత ప్రభుత్వం గుర్తించలేదని వాపోయారు. ఉద్యోగ భద్రత కల్పించి, మెరుగైన జీతం సకాలంలో ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో లాలం వెంకటరమణ, రాముునాయుడు తదితరులు ఉన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో తొమ్మిది మందికి జరిమానా



వాహనచోదకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ నాయుడు

అనకాపల్లి టౌన్, జూలై 5 : మద్యం సేవించి వాహనాలు నడిపి పట్టుబడిన తొమ్మిది మందికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున రూ.90వేలు జరిమానా విధిస్తూ స్థానిక 13వ ఎంఎం కోర్టు న్యాయమూర్తి బీవీ విజయలక్ష్మి తీర్పు ఇచ్చినట్టు ట్రాఫిక్ సీఐ పి.పైడపునాయుడు తెలిపారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన తనిఖీల్లో తొమ్మిది మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారన్నారు. వీరిని కోర్టులో హాజరు పరచగా పైవిధంగా తీర్పునిచ్చినట్టు చెప్పారు. అలాగే ట్రిపుల్ రైడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేసిన 31 మందిపై కేసులు నమోదు చేసి రూ.17,585 జరిమానా విధించామన్నారు. అనంతరం వాహనచోదకులకు సీఐ కౌన్సెలింగ్ నిర్వహించారు.

రోటరీ క్లబ్ నూతన కమిటీ ప్రమాణం



ఎన్నికైన క్లబ్ కార్యవర్గ సభ్యులు

అనకాపల్లి టౌన్, జూలై 5 : అనకాపల్లి రోటరీక్లబ్ నూతన పాలకవర్గ సభ్యులు శుక్రవారం ఇక్కడ ప్రమాణ స్వీకారం చేశారు. అధ్యక్షుడిగా సరిపల్లి రాజేష్‌కుమార్, కార్యదర్శిగా దేవత అనిల్, కోశాధికారిగా గ్రంధి సత్యేంద్రతో పాటు పలువురు సభ్యులు ప్రమాణ చేశారు. ఆంధ్రా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ కె.మురళీకృష్ణ, కోరుకొండ బుచ్చిరాజులు కమిటీని సత్కరించారు. అనంతరం మహిళలకు ఉపాధి నిమిత్తం కుట్టుమిషన్లను కడిమిశెట్టి సతీష్ సహకారంతో అందించారు. బాక్సింగ్ క్రీడాకారిణికి పారితోషికం ఇచ్చి సత్కరించారు. రోటరీ, లయన్స్ క్లబ్, భారత్ వికాస్ పరిషత్, ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

గౌరీ పంచాయతన ఆలయంలో ఆధ్యాత్మిక వేడుక

అనకాపల్లి టౌన్, జూలై 5 : గవరపాలెం గౌరీ పంచాయతన ఆలయంలో శుక్రవారం ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని నిర్వహించారు. గీజా పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ నుంచి విచ్చేసిన నరేంద్రమదల్కర్ శ్వాస మీద ధ్యాస అంశంపై అవగాహన కల్పించారు. పెద్ద సంఖ్యలో మహిళలతో పాటు ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కర్రి సన్యాసినాయుడు, బొడ్డేడ రామసత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు రెయిన్ కోట్లు పంపిణీ

పరవాడ, జూలై 5 : జీవీఎంసీ 79వ వార్డు దేశపాత్రునిపాలెం పరిధిలోని ఒకటి, రెండు సచివాలయాల పారిశుధ్య సిబ్బందికి శుక్రవారం రెయిన్‌కోట్లు పంపిణీ చేశారు. వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్, శానిటరీల కార్యదర్శులు గంగునాయుడు, కనకరాజు, నాయకులు మచ్చ శివకుమార్, వార్డు పెద్దలు పాల్గొన్నారు.

'రాంకీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి'

పరవాడ, జూలై 5 : ఫార్మా వ్యర్థ జలాలను శుద్ధి చేయకుండా గుట్టుగా గెడ్డల్లోకి విడిచిపెడుతున్న రాంకీ యాజమాన్యంపై తక్షణమే చర్యలు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె. లోకనాథం, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. స్థానిక మల్లోడిగెడ్డలో నిల్వ ఉన్న ఫార్మా వ్యర్థ జలాలను శుక్రవారం పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా రాంకీ యాజమాన్యం వ్యవహరిస్తుందని మండిపడ్డారు. ఫార్మా రసాయన వ్యర్థాలను శుద్ధి చేసి పైపులైన్ ద్వారా సముద్రంలోకి విడిచిపెట్టాల్సి ఉన్నప్పటికీ అలా చేయకుండా ఇష్టానుసారంగా బహిరంగ ప్రదేశాల్లోకి వదిలిపెడుతుండడం తగదన్నారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు నిఘా పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు

పాఠశాలలో మొక్కలు నాటిన విద్యార్థులు

తుమ్మపాల, జూలై 5 : ఇక్కడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ జీవ వైవిధ్య మండలి, ఎస్‌వీడీఎస్ ఆధ్వర్యంలో వన మహోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు మొక్కలను నాటారు. ఎస్‌వీడీఎస్ ఆపరేషన్ మేనేజర్ కర్రి చైతన్య, ఎస్‌వీడీఎస్ ప్రతినిధులు బుదిరెడ్డి నరసింగరావు, కోన అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

గెడ్డవాగులో హెచ్చరిక బోర్డు ఏర్పాటు



సబ్బవరం, జూలై 5 : జీవీఎంసీ 88వ వార్డు పరిధి వెదుళ్లనరవలో ఆక్రమణకు గురైన సర్వే నెంబరు 77/2లోని గెడ్డవాగును రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఓ రియల్టర్ గెడ్డవాగును ఆనుకొని ఉన్న జిరాయితీలో కలిపేసి లే-అవుట్ వేసిన విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ప్రచురించిన విషయం తెలిసిందే. రెవెన్యూ అధికారులు సర్వే చేపట్టి శుక్రవారం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.

వీఎంఆర్‌డీఏ ఇన్‌చార్జి కమిషనర్‌గా రవీంద్ర



విశాఖపట్నం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ)కు మెట్రోపాలిటన్ కమిషనర్ (ఎంసీ)ను నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. గత రెండేళ్లుగా ఈ సంస్థకు ఎంసీ లేరని, కలెక్టర్‌కే అదనపు బాధ్యతలు అప్పగించారని, ఆయన బదిలీపై వెళ్లాక కూడా ఎవరినీ నియమించలేదంటూ నాలుగు రోజుల క్రితం 'పెద్ద దిక్కు లేని వీఎంఆర్‌డీఏ' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. అయితే కమిషనర్‌గా ఐఏఎస్ అధికారిని నియమించడానికి ఇంకా కొంత సమయం పట్టే అవకాశం ఉందని, అంతవరకు ఆ స్థానాన్ని ఖాళీగా ఉంచకుండా ప్రస్తుతం అక్కడే జాయింట్ కమిషనర్ బాధ్యతలు నిర్వహిస్తున్న వి.రవీంద్రకు పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు ఇస్తూ నియామకపు ఉత్తర్వులు జారీచేసింది. తదుపరి ఆదేశాలు వచ్చేంత వరకు కొనసాగాలని సూచించింది. పురపాలక శాఖకు చెందిన రవీంద్ర గత మూడేళ్లుగా వీఎంఆర్‌డీఏలో జాయింట్ కమిషనర్‌గా కొనసాగుతున్నారు. అవసరమైన సందర్భాల్లో ప్రాజెక్ట్స్, అకౌంట్స్ విభాగాల బాధ్యతలను నిర్వహించారు

81వ వార్డులో విద్యుత్ సమస్య పరిష్కరించండి



విద్యుత్ శాఖాధికారిని వినతిని అందిస్తున్న మహిళలు

కొత్తూరు, జూలై 5 : జీవీఎంసీ 81వ వార్డులో గత రెండు వారాల నుంచి విద్యుత్ సమస్య ఉందని, వెంటనే పరిష్కరించాలని ఆ శాఖ ఇనస్పెక్టర్ శ్రీనివాసరావును పలువురు మహిళలు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయనను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా టీడీపీ నేతలు పీలా సత్యనారాయణ శ్రీను, మళ్ళ సురేంద్రలు మాట్లాడుతూ పోలింగ్ బూత్ 220 పరిధిలోని దిబ్బవీధి రామాలయం వెనుక భాగంలో ఉన్న మళ్లవీధిలో గత రెండు వారాల నుంచి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందన్నారు. ఈ కారణంగా నివాస గృహాల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనికితోడు దోమలు కూడా అధికమై కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయని వివరించారు. ఈ విషయాన్ని సంబంధిత అధికారులకు పలు మార్లు ఫిర్యాదు చేయగా ఓవర్ లోడ్ కారణంగా వైర్లు మెల్ట్ అయిపోతున్నాయని చెతున్నారన్నారు. తక్షణమే ఈ ప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి సమస్యకు పరిష్కారం చూపాల్సిందిగా వారు కోరారు.

జంతువుల నుంచి సంక్రమించే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కశింకోట, జూలై 5 : జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధుల పట్ల అంతా అప్రమత్తంగా ఉండాలని కశింకోట, కన్నూరుపాలెం జిల్లా పరిషత్ పాఠశాలల విద్యార్థులకు మండల పశువైద్యాధికారిణి డాక్టర్ అల్ఫోన్స్ జార్జ్, కన్నూరుపాలెం పశు వైద్యాధికారిణి మర్తి డయానా సూచించారు. పెంపుడు జంతువుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శుక్రవారం ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. కుక్కల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధి రేబీస్ అని వివరించారు ఆసుపత్రుల్లో యాంటీ రేబీస్ టీకాలు అందుబాటులో ఉన్నాయని, కుక్కలను పెంచే యజమానులు వాటికి టీకాలు వేయించాలని సూచించారు. విద్యార్థులు ఈ అంశంపై పెంపుడు జంతువుల యజమానులకు అవగాహన కల్పించాల్సిందిగా వారు కోరారు. ఈ కార్యక్రమాల్లో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంట కాలువల్లో వ్యర్థాలను తొలగించండి

తుమ్మపాల, జూలై 5 : శారదానది నుంచి ప్రవహించే పంట కాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించాలని మాజీ జడ్పీటీసీ పూసపాటి భరత్, తుమ్మపాల ఎంపీటీసీ చదరం నాగేశ్వరరావు కోరారు. శుక్రవారం తుమ్మపాలలో పంట కాలువలను వ్యవసాయదార్ల సంఘం ప్రతినిధులతో కలిసి పరిశీలించారు.

రెగ్యులర్ చేయండి సార్..

» స్పీకర్ అయ్యన్నకు కాంట్రాక్టు స్టాఫ్‌నర్సుల వినతి


అయ్యన్నపాత్రుడికి వినత పత్రం అందిస్తున్న స్టాఫ్‌నర్సులు

కృష్ణాదేవిపేట, జూలై 5 : ఏళ్ల తరబడి ప్రభుత్వ ఆసుపత్రుల్లో విధులు నిర్వహిస్తున్న తను రెగ్యులర్ చేయాలని కోరుతూ కృష్ణాదేవిపేట, కంతారం పీహెచ్‌సీల్లో పని చేస్తున్న కాంట్రాక్టు స్టాఫ్‌నర్సులు శుక్రవారం రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడుకు వినతపత్రం అందజేశారు. నర్సీపట్నంలోని అయ్యన్నపాత్రుడి ఇంటికి వెళ్లిన స్టాఫ్‌నర్సులు తొలుత పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు తమ సమస్యలను విన్నవించారు. రాష్ట్ర వ్యాప్తంగా 11,500 కాంట్రాక్టు స్టాఫ్‌నర్సులను ప్రభుత్వం రెగ్యులర్ చేసి న్యాయం చేయాలని కోరారు. ఎన్నో ఏళ్ల నుంచి కాంటాక్ట్ ప్రాతిపదికన విధులు నిర్వర్తిస్తున్నామని, ఎన్ని ప్రభుత్వాలు మారినా తమను రెగ్యులర్ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

అనంతరం స్టాఫ్‌నర్సులు విలేకరులతో మాట్లాడుతూ తమ ప్రభుత్వం రాగానే నర్సులకు న్యాయం చేస్తామన్న హామీ మేరకు న్యాయం చేయాలని కోరుతూ అయ్యన్నపాత్రుడిని కలిశామన్నారు. దీనిపై సానుకూలంగా స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి సమస్య పరిష్కారానికి తన వంతు న్యాయం చేస్తానని అయ్యన్న హామీ ఇచ్చినట్లు కాంట్రాక్టు స్టాఫ్‌నర్సులు ప్రశాంతి, నాగమణి, దేవి, అలివేణి, వరలక్ష్మి, కుమారి, యస్తారు తదితరులు తెలిపారు.

నాలుగు పాల సంఘాలకు నూతన అధ్యక్షులు


అధ్యక్షులకు నియామక పత్రాలు అందజేస్తున్న సత్యనారాయణ

బుచ్చెయ్యపేట, జూలై 5 : మండలంలోని నాలుగు గ్రామాల్లో విశాఖ డెయిరీ పాల సంఘాలకు ఎన్నిక ఏకగ్రీవం అయింది. పి.భీమవరం గ్రామ పాల సంఘాధ్యక్షుడిగా వలివిరెడ్డి రాజుబాబు, ఐతంపూడికి అప్పాన తాతబాబు, సీతయ్యపేటకు నందారపు రాజుబాబు, గొర్లె పాలేనికి పొంట్యాన శ్రీను అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరిని విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ శాలువాలతో సత్కరించి, నియామక పత్రాలు అందజేశారు.

ఎంపీ రమేశ్ విజయోత్సవ సభ రేపు


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ మండల అధ్యక్షుడు మహేశ్

కె.కోటపాడు, జూలై 5 : ఈ నెల 7న మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించనున్న అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ విజయోత్సవ సభను జయప్రదం చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు రొంగలి మహేష్ కూటమి నేతలకు పిలుపునిచ్చారు. శుక్రవారం టీడీపీ నేతలతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో మహేష్ మాట్లాడుతూ ఎంపీగా ప్రమాణ స్వీకారం చేశాక తొలిసారిగా ఆదివారం మండలానికి రానున్న సీఎం రమేష్‌కు మధ్యాహ్నం రెండు గంటలకు చౌడువాడలో ఘన స్వాగతం పలకనున్నట్టు వెల్లడించారు. అక్కడ నుంచి మండల టీడీపీ, బీజేపీ, జనసేన అధ్యక్షులు రొంగలి మహేష్, కొట్నాన ఈశ్వరరావు, బాలిబోయిన సంతోష్ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీతో సీఎం రమేష్‌ను కె.కోటపాడుకు తీసుకురానున్నట్లు తెలిపారు.అనంతరం శ్రీరావాలమ్మతల్లి ఆలయ సమీపంలో గల ఫంక్షన్ హాలులో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అధ్యక్షతన సీఎం రమేష్ విజయోత్సవ సభ నిర్వహించనున్నట్టు మహేష్ తెలిపారు. ఈ సమావేశంలో మాడుగుల పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జి జె.రాము, క్లస్టర్ ఇన్‌చార్జిలు ఎల్.మల్లేశ్వరరావు, కె.సూర్యనారాయణ, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కె.అప్పలనాయుడు, మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు ఎస్.రామునాయుడు, నాయకులు పి.నారాయణమూర్తి, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు పి.శ్రీనివాసరావు, మాడుగుల నియోజకవర్గం అధ్యక్షుడు వై.రమేష్, నాయకులు ఆర్. రామస్వామి, వి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్లు వేయించాలి


అవగాహన కల్పిస్తున్న డా.అనిల్

మాకవరపాలెం జూలై 5 : రేబిస్‌పై అప్రమత్తంగా ఉండాలని రాచపల్లి పశువైద్యాధికారి అనిల్ అన్నారు. అయితే జూనోసిస్ డే సందర్భంగా శుక్రవారం జి.కోడూరు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకుపశువుల ద్వారా సోకే వ్యాధులపై అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి తమ తల్లిదండ్రులకు వీటిపై వచ్చే వ్యాధులు, అలాగే కుక్కల వచ్చే అనార్థాల గురించి వివరించాలన్నారు. కుక్క కరిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కలిగే నష్టాన్ని వివరించారు. అన్ని పశువైద్య కేంద్రాల పరిధిలో శనివారం పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ వాక్సిన్లు వేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాగునీటి సమస్యలు పరిష్కరిస్తా

» నీటి వనరులు, జలాశయాల అభివృద్ధికి కృషి
» ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి
» పెద్దేరు జలాశయం సందర్శన


పెద్దేరు జలాశయాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే


అధికారులు, రైతులతో మాట్లాడుతున్న బండారు

మాడుగుల రూరల్, జూలై 5 : సాగునీటి వనరులు, జలాశయాలపై ప్రత్యేక దృష్టి సారించి రైతులకు సాగునీటి సమస్యలు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్టు మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి తెలిపారు. శుక్రవారం మండలంలోని రావిపాలెం వద్ద పెద్దేరు జలాశయాన్ని ఆయన పరిశీలించారు. జలాశయ స్థితిగతులపై అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎదురవుతున్న సమస్యలు తెలుసుకున్నారు. జలాశయం గేట్లుకి అమర్చిన రబ్బరు బూట్లు పగిలిపోవడంతో నీరు దిగువకు వృథాగా పోవడాన్ని గమనించి, వెంటనే అరికట్టాలని అధికారులను సూచించారు. జలాశయం గేట్ల నిర్వహణ కోసం విద్యుత్ సరఫరా చేసేందుకు వినియోగించే జనరేటర్, లైట్లు తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇక్కడి లష్కర్ సిబ్బంది ఇద్దరే ఉండడంతో మిగిలిన వారిని ఏర్పాటు చేసేందుకు ఉన్నతాధికారులతో మాట్లాడతామని చెప్పారు. జలాశయం దిగువ ఉన్న కాలువల మరమ్మతు పనులు త్వరితగతిన చేపట్టాలని సూచించారు. వర్షాలు పడితే అభివృద్ధి పనులకు ఆటంకం కలుగుతుందని ఆగస్టులోపే వీటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పెద్దేరు జలాశయంతో పాటు తారకరామ, గొర్రిగెడ్డ, ఉరకగెడ్డ, పాలగెడ్డ జలాశయాల స్థితిగతులను తెలుసుకుని వాటి పెండింగ్ పనులు చేసేందుకు కావాల్సిన నిధులు కోసం సీఎం చంద్రబాబునాయుడు, జలవనరుల శాఖామాత్యులు నిమ్మల రామానాయుడులతో చర్చించనున్నట్టు బండారు చెప్పారు. తాను రైతు బిడ్డనేనని, రైతు సమస్యలు తెలుసునని అందుకే ముందుగా నియోజకవర్గంలో సాగునీటి సమస్యలు పరిష్కరించేందుకు తొలిసారిగా జలాశయం పరిశీలించానని సత్యనారాయణ మూర్తి పేర్కొన్నారు. కూటమి నాయకులు, యువకుల సహకారంతో గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈయన వెంట మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పుప్పాల అప్పలరాజు, మండల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు అద్దిపల్లి జగ్గారావు, ఉండూరు దేముడు, పుప్పాల రమేశ్, సన్యాశిరావు, పల్లా శ్రీను తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సేవలు అధ్వానం

అధికారుల తీరుపై గ్రామసభలో పలువురు ఆగ్రహం



గ్రామసభలో పాల్గొన్న అధికారులు, గ్రామ పెద్దలు

మాడుగుల, జూలై 5 : మాడుగుల కేంద్రం స్థానిక దేవి ఆడిటోరియంలో శుక్రవారం ఉదయం గ్రామసభ నిర్వహించారు. ఈ సభకు అధికారులతో పాటు గ్రామప్రజలు హాజరయ్యారు. సభ ప్రారంభం కాగానే స్థానిక న్యాయవాది శ్రీనాథు ప్రసాదరావు, మండల సతీష్, నానాజీ, గోవింద్ తదితరులు మాట్లాడుతూ గ్రామంలో తాగునీరు, పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవడంలో పంచాయతీ విఫ లమైంద న్నారు. ఆక్రమణలు, అక్రమ కట్టడాలపై కూడా కనీస చర్యలు చేపట్టడం లేదని ఆరోపిం చారు. వైద్యం, విద్య రంగాల సేవలపై కూడా అధి కారులు దృష్టి పెట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంటింటికీ కొళాయిలో భాగంగా రోడ్లు తవ్వేసి వదిలేశారని, దీంతో వర్షాలు పడుతున్న సమయం లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ఆక్రమ ణలకు గురవుతున్న విషయాన్ని ప్రస్తావి స్తున్న సమయంలో ఉప సర్పంచ్ శ్రీనాథు శ్రీని వాసరావు మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి తాము ఎప్పుడూ సిద్ధంగా ఉంటామన్నారు. రోడ్ల విస్తరణ, గ్రామాభివృద్ధికిఅందరూ సహకరిస్తే రూ.50 లక్షలతో తాను నిర్మించిన ఇంటికి కూల్చడానికి కూడా వెనుకాడనని ప్రకటించారు. అనంతరం విద్యుత్, రక్షిత మంచినీటి పథకం, అగ్నిమాపక,పోలీస్ శాఖల పనితీరుపై సభలో చర్చించారు. అలాగే గ్రామంలో అక్రమ నిర్మాణాలు, కట్టడాలపై ఫిర్యాదులు అందితే వెంటనే వాటిని తొలగించే చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరారు. ఈ సభలో పాల్గొన్న ఈవోపీఆర్‌డీ మీనా కుమారి మాట్లాడుతూ గ్రామసభలో చర్చించిన అంశాల అమలుపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో సర్పంచ్ యడ్ల కళావతి, వార్డుమెంబరు జవ్వాది వరహాలు పాల్గొన్నారు.

వీఎంఆర్‌డీఏ ఇన్‌చార్జి కమిషనర్‌గా రవీంద్ర



విశాఖపట్నం, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : విశాఖ మహానగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ)కు మెట్రోపాలిటన్ కమిషనర్ (ఎంసీ)ను నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. గత రెండేళ్లుగా ఈ సంస్థకు ఎంసీ లేరని, కలెక్టర్‌కే అదనపు బాధ్యతలు అప్పగించారని, ఆయన బదిలీపై వెళ్లాక కూడా ఎవరినీ నియమించలేదంటూ నాలుగు రోజుల క్రితం 'పెద్ద దిక్కు లేని వీఎంఆర్‌డీఏ' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. అయితే కమిషనర్‌గా ఐఏఎస్ అధికారిని నియమించడానికి ఇంకా కొంత సమయం పట్టే అవకాశం ఉందని, అంతవరకు ఆ స్థానాన్ని ఖాళీగా ఉంచకుండా ప్రస్తుతం అక్కడే జాయింట్ కమిషనర్ బాధ్యతలు నిర్వహిస్తున్న వి.రవీంద్రకు పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు ఇస్తూ నియామకపు ఉత్తర్వులు జారీచేసింది. తదుపరి ఆదేశాలు వచ్చేంత వరకు కొనసాగాలని సూచించింది.


సర్వే సిబ్బందిని హెచ్చరిస్తున్న సరియా గిరిజనులు

హైడ్రో పవర్ ప్రాజెక్టుపై కొనసాగుతున్న సరియా గిరిజనుల నిరసన

దేవరాపల్లి, జూలై 5 : సరియా జలపాతం సమీపంలో హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణాన్ని గిరిజనుల వ్యతిరేకత కొనసాగుతోంది. ఈ ప్రాజెక్టు కోసం అదాని కంపెనీ సిబ్బంది రెండు రోజులు క్రితం చేపట్టిన సర్వేను గిరిజనులు అడ్డుకున్న విషయం తెలిసిందే, శుక్రవారం కూడా గిరిజనులు నిరసన తెలిపారు. 'తస్మాస్ జాగ్రత్త.. ఈప్రాంతంలో అడుగు పెట్టారో జాడ లేకుండా చేస్తాం. వచ్చిన దారినే వెళ్లండి' అంటూ సరియా గిరిజనులు హెచ్చరించారు. చేసేది లేక జీనబాడుపంచాయతీ దాయర్తి గ్రామానికి శుక్రవారం సర్వే సిబ్బంది బసమార్చారు. సరియా గ్రామంలో ఎవరూ లేకపోవడంతో ఒక ఇంటి వద్ద సామగ్రిని ఉంచి వారంతా దేవరాపల్లి వచ్చేశారు. సెల్ సిగ్నల్స్, భూగర్భ జలాలు గురించి సర్వే చేస్తున్నామని అదానీ కంపెనీ సర్వే సిబ్బంది చెబుతున్నారు.

దళితుడిపై దాడి చేసిన వ్యక్తులను అరెస్టు చేయాలి


పోలీసు స్టేషన్ వద్ద నిరసనలో పాల్గొన్న రెల్లి సంఘం నాయకులు

రోలుగుంట, జూలై 5 : గురువారం రాత్రి చిన పాచిల గ్రామానికి చెందిన కొంత మంది అగ్రకులస్తులు ఇదే గ్రామానికి చెందిన దళితుడైన మామిడి రాముపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారని ఘటన కారకులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం రావికమతం పోలీసుస్టేషన్ ఎదుట రెల్లి హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. గ్రామానికి చెందిన కోరుకొండ ప్రసాద్, సాసుపల్లి భరత్‌కుమార్, కోమటి రామయ్య, నక్కా రమేష్‌నాయుడు కోమటి శంకర్‌రావు తదితరులు కలిసి మూకుమ్మడిగా దాడిచేసి గాయపర్చారని ఆరోపించారు. నిందితులపై తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు యర్రంశెట్టి పాపారావు, నాయకులు మామిడి అర్జున్, పారుపల్లి నాగరాజు, మామిడి త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో అతిసార నియంత్రణ


శిరిజాంలో వైద్య, ఆరోగ్య సిబ్బంది అవగాహన ర్యాలీ

చీడికాడ, జూలై 5 : అతిసార వ్యాధి నిర్మూలనకు గ్రామస్థులంతా సమష్టిగా ముందుకు రావాలని చీడికాడ పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీనివాసరావు కోరారు. మండలంలో శిరిజాంలో శుక్రవారం ఫ్యామిలీఫిజీషియన్‌లో భాగంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అంతకుముందు గ్రామస్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా ఆహారం తినే ముందు, మల విసర్జన తరువాత చేతులను సబ్బుతో కడుక్కోవాలని, కాచి చల్లార్చిన నీటిని ప్రతిరోజు తాగాలని, బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన చేయకుండా చూడాలని సూచించారు. అనంతరం జరిగిన వైద్య శిబిరంలో 40 మంది రోగులను తనిఖీ చేసి మందులు పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ పెంటకోట పేరునాయుడు, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటరావు, ఎంఎల్‌హెచ్‌పీ పొట్నూరు దివ్య, హెచ్‌వీ భవాని, ఆశ వర్కర్లు సేవలందించారు.

మాదిగల ఆత్మగౌరవ కవాతు


కవాతులో పాల్గొన్న మాదిగ సంఘ నేతలు

చీడికాడ, జూలై 5 : మాల, మాదిగల ఆత్మగౌరవ కవాతుకు విశేష స్పందన లభించిందని మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఎలుసూరి ఘాటీలు, మాదిగల ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. మాదిగల ఆత్మగౌరవ కవాతు ఎస్సీల ఉమ్మడి ఏబీసీడీల వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులుమందకృష్ణ మాదిగ పార్టీని స్థాపించి 30 ఏళ్లు పూర్తయిన సందర్భంగా చీడికాడ మాదిగల కాలనీలో గురువారం రాత్రి ర్యాలీలు చేస్తూ ఘనంగా కవాతు నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి అనేకమంది మాదిగ కులస్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోరాటాలతోనే ఏబీసీడీల వర్గీకరణ జరుగుతుందఅన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ యువనాయకుడు రావాడ రాము, ముంజేటి నాగరాజు, కంటిపాము సంతోష్, తదితర కార్యకర్తలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆడపిల్లలు ఆత్మస్థైర్యంతో ఉండాలి

... 5వ పేజీ తరువాయి

పరిసర ప్రాంతంలో గంజాయి సేవిస్తున్న కొంతమంది యువకులు ఆడపిల్లల్ని ఇబ్బంది పెడుతున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. ఆడపిల్లలను ఇబ్బంది పెట్టే వారిని ఉపేక్షించేదిలేదని, కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పాఠశాల పరిసరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ ప్రాంతంలో పోలీసుల నిఘా పెట్టామని, ఆడపిల్లలకు పూర్తి రక్షణ కల్పిస్తామన్నారు. పలువురు విద్యార్థులు పాఠశాలల్లో వసతి, సిబ్బంది కొరత, ల్యాబ్ లేదని, భోజనం సరిగా లేదని పలు సమస్యలు తెలిపారని, వీటి పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. ఆమె వెంట సీఐ పి.అప్పలరాజు, ఎంఈఓలు కేఎస్.గాంధీ, రమేష్, తహసీల్దారు సూర్యనారాయణ, ఎంపీడీఓ కె.స్వప్న, ఈఓ పీఆర్డీ సీహెచ్.చంద్రశేఖర్, టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, పట్టణ పార్టీ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, నాయకులు బొంది కాశీవిశ్వనాథం, యాళ్ల వరహాలు, గొర్రెల రాజబాబు, మజ్జూరి నారాయణరావు, ఆయా పాఠశాలల హెచ్ఎంలు ఉన్నారు.

7న అనకాపల్లిలో జిల్లా చదరంగం జట్టు ఎంపిక

నర్సీపట్నం, జూలై 5 : రాష్ట్ర స్థాయి అండర్-19, అండర్-17 చదరంగం పోటీలకు జిల్లా జట్టు ఎంపిక ఈ నెల 7న అనకాపల్లిలో జరుగుతుందని జిల్లా చందరంగం సంఘం అధ్యక్షుడు ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. 19 ఏళ్లలోపు యువతీ యువకులు టోర్నమెంట్‌లో పాల్గొనడానికి అర్హులన్నారు. ఈ పోటీలలో గెలుపొంది మొదటి నాలుగు స్థానాలలో నిలిచిన బాలురు, బాలికల జట్లను ఈ నెల 20న జరిగే రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటలకు అనకాపల్లి సాయిశక్తి టెక్నో పాఠశాలలో పోటీలు ప్రారంభం అవుతాయని తెలిపారు. మరిన్ని వివరాలకు 9676636661, 7032562545 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

రూఫ్‌టాప్ సోలార్‌పై ప్రత్యేక దృష్టి

... 5వ పేజీ తరువాయి

నిరాటంకంగా విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రత్యేకంగా 900 ఫీడర్లు ఏర్పాటుచేస్తున్నామని సీఎండీ వివరించారు. ఇప్పుడు గ్రామాలకు కూడా త్రీ ఫేజ్ విద్యుత్ ఇవ్వడానికి ఫీడర్లు మారుస్తున్నామని, ఓవర్‌లోడ్ ఫీడర్లు కూడా గుర్తించి కొత్తవి వేస్తామని, వీటికి కేంద్ర పథకమైన ఆర్‌డీఎస్ఎస్ ద్వారా రూ.1,600 కోట్లు వెచ్చించనున్నామని చెప్పారు.

రూ.150 కోట్లతో ఏజెన్సీలకు విద్యుత్ వెలుగులు

రూ.150 కోట్లతో గిరిజన గ్రామాల్లో విద్యుత్ వెలుగులు నింపాలని శ్రీకాకుళం జిల్లా సీతంపేట నుంచి పశ్చిమ గోదావరి జిల్లా కేఆర్ పురం వరకు 35 వేల ఇళ్లను గుర్తించామన్నారు. వాటిలో 32 వేల ఇళ్లకు ఇప్పటికే విద్యుత్ కనెక్షన్లు ఇచ్చి, మీటర్లు కూడా పెట్టామన్నారు. ఇవన్నీ ఉచిత సర్వీసులేనని గుర్తుచేశారు.

త్వరలో స్మార్ట్ మీటర్లు

కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు త్వరలో స్మార్ట్ మీటర్లు అందుబాటులోకి తీసుకురానున్నట్టు చెప్పారు. మొత్తం పది లక్షల వరకు అవసరం అవుతాయని అంచనా వేశామన్నారు. తొలి దశలో 3 వేల ఫీడర్లు, 1.3 లక్షల ట్రాన్స్‌ఫార్మర్లు, ఆ తరువాత 1.4 లక్షల ప్రభుత్వ సర్వీసులు, ఆపై వాణిజ్య, పరిశ్రమలకు ఈ స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తామన్నారు. ఆ తరువాత ఎక్కువ విద్యుత్ వినియోగించే వారికి ఇస్తామన్నారు. తక్కువ విద్యుత్ వాడేవారికి, ఉచిత విద్యుత్ తీసుకునేవారికి ఈ మీటర్ల అవసరం ఉండదన్నారు. ఇవి ప్రీపెయిడ్ విధానంలో పనిచేస్తాయన్నారు. వీటిని అమర్చిన తరువాత రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల వరకు విద్యుత్ కోతలు విధించకూడదని, డిస్‌కనెక్ట్ చేయకూడదని కేంద్రం ఆదేశించిందన్నారు. ఈసమయాన్ని 'హ్యాపీ అవర్స్'గా ప్రకటించిందన్నారు.

ఏపీఐఐసీ భూమి స్వాధీనం

... 5వ పేజీ తరువాయి

సేకరించిన భూముల్లో ఏర్పాటైన కర్మాగారాల వివరాలు సేకరించారు. అలాగే వైసీపీ నాయకుడు ఆక్రమించిన పదెకరాల స్థలం గురించి ప్రస్తావనకు వచ్చింది. దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఏపీఐఐసీ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. దీంతో స్థలాన్ని ఏపీఐఐసీ అధికారులు యుద్ధప్రాతిపదికన ఖాళీ చేయిస్తున్నారు. ఇదిలా ఉండగా లంక ధర్మవరంలో సుమారు ఏడెకరాల దేవాలయ భూమిని వైసీపీ నాయకులు, రెవెన్యూ అధికారులు, ధర్మకర్తల మండలిలో కొందరు కలిసి తప్పుడు డాక్యుమెంట్లు సృషించి ఒక రియల్టర్‌కి విక్రయించేశారు. ఇక్కడ ఎకరా రూ.రెండు కోట్లు పలుకుతుండగా.. ఎకరా కేవలం రూ. 12 లక్షలకే విక్రయించేశారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో ఇటీవల కథనం రావడంతో రికార్డులు పరిశీలించి, వివరాలు తనకు చూపించాలంటూ ఎమ్మెల్యే విజయకుమార్ తహసీల్దార్‌ను ఆదేశించారు. ఇలా వైసీపీ నాయకుల అక్రమాలపై ఎమ్మెల్యే చర్యలు తీసుకుంటుండడంతో అప్పట్లో నేతలకు సహకరించిన అధికారుల వెన్నులో దడ మొదలైంది.

☛ సంక్షిప్తంగా..

ఆర్టీసీ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు : డీఎం


బస్టాండ్ సమీపంలో తొలగిస్తున్న పాక

మాకవరపాలెం, జూలై 5 : ఆర్టీసీ స్థలాల ఆక్రమణకు పాల్పడితే చర్యలు తప్పవని ఆర్టీసీ నర్సీపట్నం డీఎం ధీరజ్ హెచ్చరించారు. మాకవరపాలెం బస్టాండ్ స్థలంలో కొందరు వేసిన తాటిఆకుల పాక తొలగింపునకు శుక్రవారం ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా డీఎం ధీరజ్ మాట్లాడుతూ ఇటీవల ఆర్టీసీ స్థలంలో ప్రభుత్వ నిధులతో కొని షాపులు నిర్మించినట్టు చెప్పారు. అయితే కొంతమంది ఆర్టీసీ స్థలంలో తాటి ఆకులతో పాక ఏర్పాటు చేశారని, నోటీసు ఇచ్చినా తొలగించలేదన్నారు. దీంతో పోలీసుల సహకారంతో పాకను తొలగించామన్నారు. తమ అనుమతి లేకుండా ఎవరైనా దుకాణాలు ఏర్పాటు చేస్తే కేసులు పెడతామన్నారు. అలాగే ప్రభుత్వం నిర్మించిన షాపులకు ఇప్పటికే వేలం నిర్వహించామని ఆ షాపుల్లో దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు.

సర్వర్లు పని చేయక ఇక్కట్లు

మాడుగుల, జూలై 5 : మాడుగుల కేంద్రంలో గత వారం రోజులుగా పంచాయతీ సచివాలయాలతో పాటు మీ-సేవా కేంద్రాలలో సర్వర్లు సరిగా పని చేయకపోవడంతో ప్రజలు నానాఅవస్థలు పడుతున్నారు. మీ- సేవా, సచివాలయాల్లో పుట్టిన తేదీ, కుల, ఆదాయ ధ్రువీకరణ, అడంగల్ వంటి పత్రాలు చేయించుకునేందుకు గత నాలుగైదు రోజులుగా ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. అయితే సర్వర్లు చేయడం లేదంటూ సిబ్బంది చెబుతుండడంతో ఉసూరుమంటూ వెనుదిరుగుతున్నారు. అడ్మిషన్స్ సమయం కావడంతో ఈ ధ్రువపత్రాల అవసరం ఉంటుంది. దీనిపై సంబంధిత శాఖ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలంటూ పలువురు కోరుతున్నారు.

మెగా రక్తదానం రేపు

చోడవరం, జూలై 5 : పట్టణంలోని ప్రేమసమాజం ఆవరణలో ఈ నెల 7న (ఆదివారం) కాపు రాక్స్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్టు కాపు రాక్స్ ప్రతినిధులు ఆకుల రమేష్ తెలిపారు. ఈ శిబిరంలో అధిక శాతం మంది పాల్గొని రక్తదానం చేయాలని కోరారు.

జంతు సంక్రమిత వ్యాధులపై అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పశు వైద్య సిబ్బంది

మాడుగుల రూరల్, జూలై 5 : మండలంలోని కింతలి వల్లాపురం, కేజేపురం, ఎం.కోడూరు గ్రామాల్లో గల పాఠశాలల్లోని విద్యార్థులకు శుక్రవారం అక్కడి పశు వైద్యులు జంతు సంక్రమిత వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పెంపుడు కుక్కలకు తప్పనిసరిగా టీకా మందులు వేయించాలని, చనిపోయిన పశువులను సున్నపు గుంతల్లో లోతుగా పాతిపెట్టాలని సూచించారు. ఎలుకలు నివాసిత ప్రాంతాల్లో లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యులు నరేశ్, మణి లక్ష్మణ్, అరుణా కిరణ్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సకాలంలో పన్నులు చెల్లించాలి


గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ బాబూరావు

దేవరాపల్లి, జూలై 5 : పంచాయతీకి చెల్లించాల్సిన ఇంటి పన్నులు సకాలంలో చెల్లించి, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగ పర్చుకోవాలని సర్పంచ్ బాబూరావు కోరారు. శుక్రవారం బహిరంగంగా గ్రామ సభ నిర్వహించారు. పంచాయతీ పరంగా అందాల్సిన సేవలను అందిపుచ్చుకోవాలన్నారు. ఉప సర్పంచ్ అప్పలనర్సమ్మ, కార్యదర్శి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అతిసారపై అప్రమత్తంగా ఉండాలి

తురకలపూడి పీహెచ్‌సీ వైద్యాధికారి సంధ్యారాణి


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

బుచ్చెయ్యపేట, జూలై 5 : అతిసారపై అప్రమత్తత అవసరమని తురకలపూడి పీహెచ్‌సీ వైద్యాధికారి సంధ్యారాణి అన్నారు. ఆమె శుక్రవారం రాజాంలో నిర్వహించిన అతిసారంపై అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ ముఖ్యంగా... అయిదేళ్లలోపు పిల్లలు అతిసార బారినపడతారన్నారు.వాంతులు, విరేచనాలు, స్పృహ తప్పినట్టు అనిపించడం, విరేచనాలలో రక్తం, చీము పడడం, తరచూ నీరసించిపోవడం, జ్వరం రావడం, కడుపు పొంగడం అతిసార ప్రధాన లక్షణాలన్నారు. ఈ లక్షణాలు కలిగిన పిల్లలకు తక్షణం వైద్యసేవలు అందించాలన్నారు. ర్యాలీ అనంతరం స్థానిక ప్రాథమిక, జడ్పీ హైస్కూల్స్ విద్యార్థులకు అతిసారపై డాక్టరు సంధ్యారాణి అవగాహన కల్పించారు.